ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 14 మే 2025



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.5	29.8
కావలి	38	29
ఆత్మకూరు	41	29
ఉదయగిరి	40	29
కందుకూరు	40	29



ఫీజు మోత

- టెక్నోల పేర్లతో విద్యా వ్యాపారం
- అందినకాడికి దండుకుంటున్న యాజమాన్యాలు
- ఆపై పుస్తకాలు, యూనిఫాం భారం
- తల్లిదండ్రుల జేబుకు చిల్లు
- వసతుల కల్పన మాత్రం అధ్వానం
- పర్యవేక్షణలో చేతులెత్తేస్తున్న విద్యాశాఖ



జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కాన్సెప్ట్, ఐఐటీ, టెక్నో, ఈ-టెక్నో, స్మార్ట్, టాలెంట్, ఒలింపియాడ్, సీబీఎస్ ఇలా ఆకర్షణీయమైన పేర్లతో బోర్డులు పెట్టుకుని ఫీజుల పేరిట దండేస్తున్నారు. ఇది చాలదన్నట్టు బహిరంగ మార్కెట్‌లో రూ.2-3వేలకు లభించే యూనిఫాం, పుస్తకాలను కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ.8-10 వేలు వసూలు చేస్తున్నారు. ఈ ఫీజులను నియంత్రించడంలో మాత్రం విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారు. 'ప్రైవేట్ ఫీజులకు అడ్డుకట్టవేస్తాం.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తాం' అంటూ ప్రభుత్వం తెచ్చిన జీఓ అమలు కావడం లేదు. ఈ ఏడాది ఫీజుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దీని అమలు ఎలా ఉంటుందన్న దానిపై అందరిలో ఉత్కంఠ నెలకొంది.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్లు చేయించుకుంటున్నాయి. పరిమిత సీట్లు అంటూ బోర్డులు పెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు వారి ఆర్భాటపు ప్రకటనలు నమ్మి ముందుగానే అడ్మిషన్లు పొందుతున్నారు. పేరుకే కార్పొరేట్ పాఠశాలలుగా చెప్పుకుంటున్నా అక్కడ వాస్తవ పరిస్థితుల్లో మాత్రం మౌళిక సదుపాయాలు దారుణంగా ఉంటున్నాయి. చాలా పాఠశాలలను ఇరుకు భవనాల్లో నడుపుతున్నారు. క్రీడామైదానాలు కనిపించవు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు మరుగుదొడ్లు ఉండటం లేదు.

● బలహీనతే వారి బలం

పిల్లల చదువు అనగానే తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థోమత మరిచి ఎంత ఖర్చయినా పర్వాలేదు మంచి స్కూల్లో చేర్పించాలని అనుకుంటున్నారు. ఈ బలహీనతే కార్పొరేట్ స్కూళ్లకు వరంగా మారి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. కొంతమంది తల్లిదండ్రులు ఏ పాఠశాలలో ఫీజులు ఎక్కువగా ఉంటాయో, మార్కెట్‌లో దేనికి ఎక్కువ పేరుందో ఆ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించేందుకు తపన పడుతున్నారు. దీంతో స్కూల్‌లో అడుగుపెడితే అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి 10వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనికితోడు ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లైబ్రరీ, లేబొరేటరీ, ఫర్నిచర్, కార్పస్ ఫండ్, కాషన్ ఫీజు, స్మార్ట్ క్లాసులు.. ఇలా ఫీజుల చిట్టా విప్పుతూ ఊపిరి పీల్చుకోనివ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతో పాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. అతికష్టం మీద ఈ ఫీజులు చెల్లించిన తరువాత పుస్తకాలు, యూనిఫాం, షూలు, అట్టలు, ఇలా వాటి జాబితా కూడా చాంతాడంత ఉంటోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఫస్ట్‌టర్మ్ ఫీజు 60శాతం చెల్లించి బతుకుజీవుడా అనుకుంటూ బయటపడేలోపే రెండో టర్మ్ ఫీజు చెల్లించాలని లేదంటే పరీక్షలు రాయించమని పిల్లల డైరీల్లో రాసి పంపిస్తున్నారు. కనీస సదుపాయాలు లేని పాఠశాలలు సైతం ఫీజుల విషయంలో నిక్కచ్చిగా ఉంటున్నాయి.

● అమలు కాని ప్రతిపాదనలు

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారులతో గతంలో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌళిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. నూతన జిల్లా ప్రాతిపదికన నెల్లూరు జిల్లాలో స్టార్-2 కింద 102 స్కూళ్లు, స్టార్-3 కింద 328 స్కూళ్లు, స్టార్-4 కింద 80 స్కూళ్లు ఉండగా స్టార్-1, 5లలో మాత్రం ఏ స్కూల్‌కు ర్యాకింగ్ రాలేదు. మొత్తం మీద 510 స్కూళ్లకు ర్యాకింగ్‌లు ఇచ్చారు. స్టార్ రేటింగ్ స్కూల్స్‌కు 1 నుంచి 8వతరగతి వరకు ఫీజులు కూడా నిర్ధారిస్తూ ఈ కమిటీ సిఫారసు చేసింది. అలాగే ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు.. ఎంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలకు ఉన్న ప్రత్యేకతలు ఏమిటి? తదితర సౌకర్యాల వివరాలను తల్లిదండ్రులకు కనిపించేలా బోర్డులో ప్రదర్శించాలి. పాఠశాలల్లో వసూలు చేసే ఫీజులన్నిటికీ రసీదులు ఇవ్వాలి. ఇలా పలు రకాల నిబంధనలు కూడా విధించారు. అయితే దీనిపై ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్లు మాత్రం ఈ ఫీజులతో తాము పాఠశాలలు నడపలేమని, న్యాయపోరాటాలు చేస్తామని చెబుతుండడంతో ఇది అమలవుతుందా లేదా అన్నది వేచి చూడాలి.

స్టార్ రేటింగ్ వారీగా ఫీజుల వివరాలు (రూ.లలో)

తరగతి	స్టార్-1	స్టార్-2	స్టార్-3	స్టార్-4	స్టార్-5
1-3 వరకు	6,000	7,500	8,600	10,000	12,500
4-5 వరకు	9,000	9,500	10,500	12,000	15,500
6	9,000	9,500	11,100	12,000	15,500
7-8 వరకు	9,500	10,500	11,100	15,000	18,000



ప్రభుత్వ బడుల లెక్క తేలింది!

నెల్లూరు (విద్య): ప్రభుత్వ బడుల లెక్క తేలింది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఖాళీ పోస్టుల భర్తీపై చేపట్టిన పరిశీలన పూర్తవడంతో జిల్లాలో అన్ని రకాలు కలిపి 3,221 పాఠశాలలు ఉంటాయని అధికారులు తేల్చి చెప్పారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలకు శాటిలైట్ స్కూల్స్‌గా నామకరణం చేసినా జిల్లాలో ఒక్కటి కూడా లేకుండా అన్నీ మూసివేశారు. భవిష్యత్‌లో అక్కడ విద్యార్థులు చేరే అవకాశం ఉంటే తిరిగి పునరుద్ధరణ చేస్తారని అధికారులు తెలిపారు. అలాగే పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తయిన నేపథ్యంలో బదిలీల షెడ్యూల్ మరో 2 రోజుల్లో విడుదల కానుంది. ఐదేళ్లు ఒకే స్కూల్లో పని చేసిన హెచ్‌ఎంలు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీ టీలు, ఇతర కేటగిరి ఉపాధ్యాయులు 8 ఏళ్లు ఒకే పాఠశాలలో పని చేస్తే తప్పక బదిలీ అవుతారు. 2017లో భారీగా బదిలీలు జరగగా, 2023లో మాత్రం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో అతి తక్కువమందికి మాత్రమే బదిలీలు జరిగాయి. దీంతో ఈ ఏడాది భారీగానే బదిలీలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో బడుల స్వరూపం

శాటిలైట్ స్కూల్స్	0
ఫౌండేషన్ స్కూల్స్	968
బేసిక్ ప్రైమరీ స్కూల్స్	1187
మోడల్ ప్రైమరీ స్కూల్స్	594
అప్పర్ ప్రైమరీ స్కూల్స్	79
హైస్కూల్స్	288
హైస్కూల్స్ + బీపీఎస్	74
హైస్కూల్స్ + ఎంపీఎస్	31

17న హీట్ ద బీట్ : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న హీట్ ద బీట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా భవనాలపై రూఫ్‌టాప్ గార్డెన్ ఏర్పాటు, కూల్ పెయింట్ వేసుకోవాలని, రద్దీ కూడళ్లలో నీడ సౌకర్యం కోసం షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే చలివేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంటల నిర్మాణం వంటి ఉష్ణోగ్రతలు తగ్గించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వడదెబ్బ బారిన పడిన వారి కోసం వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. పక్షులు, పశువుల కోసం తొట్టెలు, పాత్రల్లో నీరు నింపి అందుబాటులో ఉంచాలని సూచించారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- పనులు జరక్కపోవడంతో వర్కుల రద్దుకు ప్రభుత్వం నిర్ణయం
- మళ్లీ ఎప్పటికి మంజూరయ్యేనో!?

ఎవరో చేసిన పాపాలకు ఇంకెవరో శిక్ష అనుభవిస్తున్నారంటే ఇదే. పనులు చేయాల్సిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించిన మూలంగా ఇప్పుడు ఆ ప్రభావాన్ని ప్రజలు అనుభవిస్తున్నారు. ఈపాటికి బాగు పడాల్సిన రోడ్లు అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా రద్దయ్యాయి. వైసీపీ హయాంలో లెక్కకు మించి పనులు మంజూరు చేయడం పైగా టెండర్లు దక్కించుకొన్న కాంట్రాక్టర్లు పనులు చేయకుండా ఉండటంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నెల్లూరు-మైపాడు, ఎన్‌పీఎస్ రోడ్ల పనులు పునరుద్ధరించాలని ఆయా ఎమ్మెల్యేలు కోరినా ఫలితం దక్కలేదు.

8

పుత్రశోకం!

వారిది రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. అయినా ఉన్నంతలో ఎంతో సంతోషంగా ఉంటున్నారు. కలిగిన ఇద్దరు మగ సంతానాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ చదివిస్తున్నారు. ఎదుగుతున్న పిల్లల్ని చూసి తల్లిదండ్రులు కూడా మురిసిపోయారు. అయితే, వీరిపై మృత్యువుకు కన్ను కుట్టినట్టుంది. వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఆ అన్నదమ్ములను పొట్టనపెట్టుకుంది. ఈతకని కనిగిరి కాలువలోకి దిగి గల్లంతైన బాలుర మృతదేహాలను మంగళవారం వెలికితీశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డలు జీవచ్ఛవంలా పడి ఉండటాన్ని చూసి కన్నపేగు తల్లడిల్లింది. గుండెలవిసేలా రోదించింది. ఇక తమకు దిక్కెవరంటూ బిడ్డలపై పడి విలపిస్తున్న ఆ తల్లిదండ్రులను చూసి సంగంవాసుల్లోనూ కంటతడి తెప్పించింది.



కుమారుల మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లి శేషమ్మ

6



రథంపై వేదగిరీశుడి వైభోగం

నెల్లూరురూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు ఘట్టానికి చేరుకున్నారు. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను వివాహమాడిన లక్ష్మీనరసింహస్వామి మంగళవారం ఉదయం వారితో కలిసి పల్లకీలో ఊరేగింపుగా దేవరపాళెం చేరుకున్నారు. అక్కడ విశేషంగా అలంకరించిన రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు భక్తులను కటాక్షిస్తూ పురవీధుల్లో విహరించారు. తరలివచ్చిన భక్తజనం గోవింద నామస్మరణలతో పల్లె మారుమోగిపోయింది. తొలుత ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డిలు పూజలు చేసి తొలి కొబ్బరికాయకొట్టారు. అనుకున్న సమయానికంటే మూడు గంటలు ఆలస్యంగా రథోత్సవం మొదలవడంతో భక్తులు తీవ్రంగా వేసవి తాపానికి గురయ్యారు. రథానికి ఎదురు బిందెలతో నీళ్లు చల్లుతూ, టెంకాయలు కొడుతూ, కర్పూరం వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు జాగ్రత్తలు తీసుకున్నారు. పలు సేవా సంస్థలు భక్తులకు మంచి నీరు, మజ్జిగలను అందించాయి.



ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు తీసుకుంటున్న కార్తీక్, పక్కన చైర్మన్ కోటంరెడ్డి

నుడా అభివృద్ధికి సమష్టిగా పని చేయండి

● అధికారులతో ఇన్‌చార్జ్ వీసీ కార్తీక్

నెల్లూరు (జడ్పీ), మే 13 (ఆంధ్రజ్యోతి) : నుడా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమష్టిగా పని చేయాలని జాయింట్ కలెక్టర్, నుడా ఇన్‌చార్జి వీసీ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నుడా వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టగా, చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షలో ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ నుడా లేఅవుట్ల అనుమతులకు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా నుడా అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచలరెడ్డి, డీపీవో హిమబిందు, డీఈ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెదర్ రంగంలో శిక్షణ, ఉద్యోగావశాలు

● డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం), మే 13 : డీఆర్‌డీఏ-సీడాప్ ఆధ్వర్యంలో ఎస్సీ యువతీ యువకులకు లెదర్ రంగంలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డెరెక్టర్ నాగరాజకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఆపైన చదివి, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన ఎస్సీ యువతకు 45 రోజులు ఉచిత శిక్షణ ఇచ్చి, ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ శిక్షణ పేరు లెదర్ స్టిచ్చింగ్, కటింగ్ ఆపరేటర్ అని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి ఉంటుందని, సర్టిఫికెట్ కూడా ఇస్తారని తెలిపారు. అర్హత కలిగిన వారు బయోడేటా, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, విద్యార్హతల జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో డీఆర్‌డీఏ-జాబ్స్ విభాగంలోగానీ, బోగోలు తహసీల్దారు కార్యాలయం దగ్గరున్న వైటీసీ భవనంలో గానీ సంప్రదించాలని కోరారు.

నమో లక్ష్మీనారసింహా!

పెంచలలోని చక్రతీర్థ స్నానం, తెప్పోత్సవం

వసంతోత్సవంతో శోభిల్లిన కోన

ముగిసిన ఉత్సవాలు, నేడు గోనుపల్లికి శ్రీవారు







దేవేరులతో కలిసి పుష్కరిణిలో విహరిస్తున్న పెంచల నారసింహుడు, పుష్కరిణిలో చక్రస్నానం జరుపుతున్న అర్చకులు

8

టీడీపీ సీనియర్ నేత తిరుపాలయ్య మృతి

వెంకటాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మల్లి తిరుపాలయ్య (65) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. దీంతో పలువురు మండల నేతలతో పాటు మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాట్ల వెంకటసుబ్బయ్య, వెంకటాచలం మాజీ సర్పంచి వలిపి మునుస్వామి తదితరులు తిరుపాలయ్య భౌతికకాయానికి నివా ళులర్పించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫోన్ ద్వారా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరుపాలయ్య కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9117
వెండి కిలో ధర	రూ. 99,800
వెండి ఒక గ్రాము	రూ. 102.80



మంత్రి రామానాయుడితో చర్చిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మంత్రి నిమ్మలతో సోమిరెడ్డి భేటీ

వెంకటాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : అమరావతి సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డేగపూడి - బండేపల్లి కాలువ నిర్మాణం, సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ, కండలేరు ఎడమ కాలువ తదితర పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నతిపత్రం అందజేశారు. అలాగే లస్కర్ల సమస్యల పరిష్కారంపై కూడా మంత్రితో ఆయన చర్చించారు.

జనసేన ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రంలో మజ్జిగ అందిస్తున్న సురేష్

ముత్తుకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మంగళవారం ముత్తుకూరులో మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవానీతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ముత్తుకూరు జనసేన మండల సీనియర్ నాయకులు రహీం, వెంకటాచలం మండల కార్యదర్శి సందూరి శ్రీహరి, చిన్న, అఖిలేష్‌గౌడ్, ఇబ్రహీంజానీ బాయ్, సమత్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి పాతవంగల్లు వాసుల ధన్యవాదాలు

కొడవలూరు, మే 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతవంగల్లు పంచాయతీ పరిధిలోని వడ్డిపాలెం మొత్తానికి తాగునీరు అందించే బావిలో నీరు అడుగంటిపోయాయి. బావిలో పూడికతీయిస్తే తప్ప ఆ గ్రామానికి తాగునీరు అందని పరిస్థితి. ఈ విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె బావిలో పూడికతీతకు సంబంధించి అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన పంచాయతీ రాజ్ అధికారులు పాత వంగల్లు టీడీపీ నాయకులు యుగంధర్‌సింగ్, సర్పంచ్ లక్ష్మీబాయిల ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టారు. దీంతో బావిలోకి ఊటనీరు చేరింది. వడ్డిపాలెం వాసుల తాగునీటికి సమస్యను పరిష్కరించిన ఆమెకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ప్రసన్నాంజనేయస్వామి జయంత్యుత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం, మే 13(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కొలు వైవున్న సీత, లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయంలో కొలువువైవున్న ప్రసన్నాంజనేయస్వామికి బుధవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు నవరాత్రి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రతిరోజు రాత్రి హరే రామ సంకీర్తనలతో పల్లకి సేవ చేస్తారని తెలిపారు. 19 నుంచి 22వ తేదీ వరకు ఆలయంలో సాయంత్రం శ్రీకృష్ణ భగవాన్ ట్రస్టు వారిచే హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని తెలి పారు. 9 రోజుల పాటు స్వామి వారికి అభిషేకము, సహస్రనామార్చన, పూలంగి సేవాలంకారము, నిర్వహి స్తారని ఆయన తెలిపారు.

రోడ్డు మలుపుల్లో ప్రమాదాలు

- గత ఏడాదిలో ఏడుకిపైగా యాక్సిడెంట్లు
- ఇద్దరు మృతి, పలువురికి తీవ్రగాయాలు

వెంకటాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి): పలుచోట్ల రోడ్డు మలుపులు ప్రమాదకరంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంకటాచలం నుంచి కసుమూరు వరకు 9 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డులో అడుగడుగునా ప్రమాదకరమైన మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనుపూరులో ఉండే రెండు మలుపులు మృత్యు కుహరాలుగా ఉన్నాయి. ఇవి వాహనాలు సమీపంలోకి వచ్చే వరకు కనిపించవు. దీంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొంటున్నాయి. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు గాయాలపాలయ్యారు. అలాగే వెంకటాచలం - కనుపూరు గ్రామాల మధ్య కూడా పలు ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద కూడా తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కనుపూరు - చవటపాళెం, కసుమూరు - పాలిచెర్లపాడు, కసుమూరు - కురిచెర్లపాడు గ్రామాల మధ్య కూడా ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి.

● గేదెలు, కుక్కలతో ప్రమాదాలు

కసుమూరు రోడ్డుపై ప్రయాణించే వారికి ప్రమాదం మరో రూపంలో పొంచి ఉంది. రోడ్డుపై రాత్రి సమయంలో గేదెలు పడుకుని ఉంటాయి. నల్లని తారు రోడ్డుపై అదే రంగు కలిగిన గేదెలు పడుకుని ఉండడంతో అవి కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో పలువురు ఈ గేదెలను ఢీకొని ప్రాణాలను పోగొట్టుకున్నారు. ఏడాదిలోనే కసుమూరుకు చెందిన ఒక వ్యక్తి, చెరుకుమూడికి చెందిన మరో వ్యక్తి గేదెలను ఢీకొని మృతి చెందా రు. అంతేకాక పలువురు గాయాలపాల య్యారు. కసుమూరుకు ఇతర ప్రాంతాల యాత్రికులు వస్తుంటారు. ఈ గేదెల పట్ల వారికి అవగాహన లేక ఎక్కువమంది ప్రమాదాల బారిన పడుతున్నారు. కనుపూరు - కసుమూరు మధ్య కుక్కల బెడద అధికంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు రాత్రిపూట వెళ్తుంటే కుక్కలు వెంబడిస్తుం టాయి. ఈకారణంగా కొందరు కంగారుపడి ప్రమాదాల బారిన



కనుపూరులో ప్రమాదకరంగా మలుపు

పడుతున్నారు. కుక్కల బెడద, రోడ్లపై గేదెలు లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనే ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మ్యాన్‌పవర్‌గా గుర్తించే వరకు పోరాటం



మాట్లాడుతున్న గోడ భాస్కర్

ముత్తుకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులను మ్యాన్‌పవర్ కార్మికులుగా గుర్తించేంత వరకు పోరాటం ఆగదని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు గోడ భాస్కర్ తెలిపారు. మంగళవారం ప్రాజెక్టు గేటు వద్ద నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు అధికారులు, ప్రభుత్వం కార్మికుల సంక్షేమం గురించి ఆలోచించాలని కోరారు. ఇన్ని రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. వెంటనే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

బ్రహ్మదేవిలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక వైద్య శిబిరం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, వైద్య సిబ్బంది, విద్యార్థినులు

ముత్తుకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రహ్మదేవిలో మంగళవారం జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు జరిగాయి. దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, హిమోగ్లోబిన్, మధుమేహం పరీక్ష చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కీళ్ల నొప్పులు, జ్వరాలు, దగ్గు సమస్యలకు చికిత్స చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ ఏవీఎస్ శాస్త్రి మాట్లాడుతూ ఏడాదిలో రెండుసార్లు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవా లన్నారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ శాంతి, డాక్టర్ జోత్స్న, సూపర్వైజర్ ప్రమీల, ఏఎన్‌ఎం చంద్రకళ, ఏజీ బీఎస్సీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సైదాపురంలో మంగళవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ మండలంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 102 మందికి ఉచితంగా 90 రోజు ల్లో కుట్టుశిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామ న్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఏడీ నిర్మల, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, తహసీల్దార్ రమాదేవి, జడ్పీటీసీ పోలయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా మోహన్‌రెడ్డి, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఇండస్ట్రియల్ హబ్ కానుకగా ఇస్తా

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మే 13(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేయించి యువతకు కానుకగా ఇస్తానని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన జాబ్‌మేళాలో ఆమె పాల్గొని జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 75 ఏళ్ల వయసులోనూ సంపద సృష్టించాలనే నినాదం, యువతకు మంచి భవిష్యత్తు కోసం విజన్-2047 గురించి సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. జిల్లా మొత్తం ఎంప్లాయిమెంట్ తీసుకురావాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చూస్తున్నారన్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు సరిపోవని నిరుత్సాహంతో వెళ్లిపోకుండా ఏదో ఒక ఉద్యోగంతో తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా ఎదగాలని కోరారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జూలైలో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేసి అభినందించారు. జాబ్‌మేళాలో 21 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా 225 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయూమ్, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ, టీడీపీ నాయకులు ఎంవీ.శేషయ్య, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● మోసాలను అరికట్టేందుకే రీసర్వే

కోవూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): భూముల క్రయ విక్రయాల్లో మోసాలను అరికట్టేందుకే ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని వేగూరులో మంగళవారం జరిగిన కార్య క్రమంలో ఆమె మాట్లాడారు. పాత భూ రికార్డులను సరిచేసి కొత్తగా చేసిన సర్వే ఆధారంగా పాసుపుస్తకాలు పంపిణీ చేయ నున్నట్లు వివరించారు. రీసర్వే వల్ల భవిష్యత్తులో ఎలాంటి వివా దాలు తలెత్తవని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనూష, తహసీల్దారు నిర్మలానందబాబా, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, సర్పంచు కరేటి అమరావతి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, దారా విజయబాబు, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, వేగూరు సుబ్బానాయడు తదితరులు పాల్గొన్నారు. విడవలూరు మండలంలోనూ ఎమ్మెల్యే పర్యటించారు.

నిబద్ధతతో కూడిన శిక్షణ ఎన్‌సీసీతోనే సాధ్యం



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

వెంకటాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : దృఢ సంక ల్పం, ఆత్మవిశ్వాసం, నిబద్ధతతో కూడిన శిక్షణ ఎన్‌సీ సీతోనే సాధ్యపడుతుం దని ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ డీ. కరంచంద్ అన్నారు. మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న అక్షర విద్యాల యంలో మంగళవారం ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఫైరింగ్, డ్రిల్, వ్యాయామం, యోగాపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్‌సీసీ సిలబస్‌పై తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవడం ఎన్‌సీసీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, ఎన్‌సీసీ అధికారులు బాలబ్రహ్మాచారి, మస్తాన్‌వలి, పెంచలపుల్లయ్య, దీప్తి, హరీష్‌రెడ్డి, జయరాం, శ్రీపతిప్రసాద్, జావీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇవి వృథాయేనా!?

- గ్రామాల్లో నిరుపయోగంగా ట్యాంకులు
- నీటి ఎద్దడితో ప్రజల అవస్థలు



కాళయకాగొల్లు దళితవాడ వద్ద నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

బుచ్చిరెడ్డిపాళెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీతోపాటు గ్రామాలలో లక్షలాది రూపాయలతో నిర్మించిన నీళ్ల ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంతో డైరెక్ట్ పైప్‌లైన్ పేరుతో నిర్వాహకులు మోటార్లను వేసి నీటి సరఫరా చేశామనిపిస్తున్నారు. దీంతో ఎత్తు ప్రదేశాలకు నీరు సరఫరా కాక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి మరింత జటిలంగా మారింది. దిష్టిబొమ్మల్లా ఉన్న ట్యాంకులను వాడుకలోకి తెచ్చే విషయంలో అధికారులు, పాలకులు పట్టీపట్టనట్టు వ్యవహ రిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుచ్చి, వవ్వేరు, కట్టుబడిపాళెం, ఇస్కపాళెంతోపాటు కాళయకాగొల్లు, నాగాయగుంట, పెనుబల్లి, సాల్మానుపురం, తదితర గ్రామాలలో లక్షలాది రూపాయలతో నిర్మించిన ట్యాంకులు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. వీటిని వినియోగంలోకి తెస్తే ఎత్తైన ప్రదేశంలో ఉన్న ప్రజలకు నీటి ఎద్దడి తీరుతుంది. నగర పంచాయతీలోని వవ్వేరు కట్టుబడిపాళెం, ఇస్కపాళెం పరిధిలో నీటి ఎద్దడిపై ప్రజలు ఏకరువు పెడుతున్నారు.

ట్యాంకులను పరిశీలిస్తాం

మండలంలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకులను పరిశీలించి నిధులు సమకూర్చుకుని వినియోగంలోకి తెస్తాము. ఈ మేరకు గ్రామ పంచాయతీలలో వివరాలు సేక రిస్తున్నాము. నాగాయగుంటలలో తాగునీటి ఎద్దడిపై ఎమ్మెల్యే సహకారంతో 4బోర్లు వేశాము. త్వరలో నీటి సరఫరా చేస్తాము.

- శ్రీహరి, ఎమ్పీడీవో



వవ్వేరులో దిష్టిబొమ్మను తలపిస్తున్న ట్యాంకు

● జగనన్న లేఔట్ల కోసం..

పెనుబల్లిలోని తిప్ప మీద ఎత్తైన ప్రాంతంలో వున్న 2 ట్యాంకులను జగనన్న లేఔట్ల పేరుతో నాలుగేళ్ల క్రితం కూల్చేశారు. కానీ అక్కడ ఇళ్లు కట్టింది లేదు. ట్యాంకులు కూల్చేయడంతో గమళ్లపాళెం, గిరిజన కాలనీలలో నీటి ఎద్దడి నెలకొంది. ఆయా ప్రాంతాల ప్రజల విన్నపం మేరకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

CRIME NEWS



చందు మృతదేహాన్ని బయటకు తీసుకుని వస్తున్న స్థానికులు

కనిగిరి కాలువలో గల్లంతయిన అన్నదమ్ముల మృతదేహాలు లభ్యం

- మిన్నంటిన కన్నవారి రోదనలు
- స్థానికుల కంటతడి



నందు మృతదేహాన్ని నీటిలో నుంచి గట్టుకు తీసుకువస్తున్న ఈతగాళ్లు

సంగం, మే 13 (ఆంధ్రజ్యోతి): కనిగిరి కాలువలో గల్లంతైన అన్నదమ్ముల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. కోవూరు స్టౌబీడీ కాలనీకి చెందిన బందా గోవిందయ్య, శేషమ్మల కుమారులు చందు (14), నందు (11) వేసవి సెలవులకు పది రోజుల కిందట సంగంలోని అమ్మమ్మ, పెద్దమ్మల ఇంటికి వచ్చారు. స్థానిక విద్యార్థులతో కలసి సోమవారం కనిగిరి ప్రధాన కాలువలో ఈతకెళ్లి నీటిలో గల్లంతైన విషయం విదితమే. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులు ఇరిగేషన్ అధికారుల సాయంతో కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో మంగళవారం ఉదయానికి నీటి మట్టం బాగా తగ్గి వారు మునిగిన చోటకు 200 మీటర్ల దూరంలో చందు మృతదేహం లభ్యమయింది. కాలువ క్రాస్ రెగ్యులేటర్లకు దిగువన నందు మృతదేహం లభ్యమయింది. రెండు మృతదేహాలను పోలీసులు ఒడ్డుకు చేర్చారు.

● కొడుకులిద్దరూ ఒకేసారి మృతి

కొడుకులద్దరినీ ఉన్నత చదువులు చదివించాలని ఆ దంపతులు కలలు కన్నారు. ఈ క్రమంలో సెలవులను ఆనందంగా గడపాలని అమ్మమ్మ ఇంటికి వచ్చి మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆర్తనాదాలు మిన్నంటాయి. వాస్తవానికి వీరిద్దరు రెండు, మూడు సంతానం. మొదటి సంతానం కూడా కుమారుడే. ఏడాది తిరక్కముందే మృతి చెందాడు. ఆ తరువాత వీరిద్దరు పుట్టారు. పుట్టిన ముగ్గురు కుమారులు ఇలా మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల కడుపుకోత చెప్పనలివి కాకుండా ఉంది.

● మృతదేహాలు పోస్టుమార్టానికి తరలింపు

వెలికితీసిన మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాలను వారి స్వగ్రామం కోవూరు స్టౌబీడీ కాలనీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పరామర్శ

కోవూరు : సంగం సమీపంలో కనిగిరి కాలువలో ఈతకు వెళ్లి మృతి చెందిన నందు, చందు బాలుర తల్లిదండ్రులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరామర్శించారు. స్థానిక స్టౌబీడీ కాలనీలో ఉంటున్న బాలుర తల్లిదండ్రులను బందా గోవిందయ్య, శేషమ్మలను ఎమ్మెల్యే ఓదార్చారు. ఆమె వెంట పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, చెంబేటి పెంచలయ్య, బాలరవి, ముసలి సుధాకర్ తదితరులు ఉన్నారు. అలాగే, సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి మూలం రమేష్, శేషయ్య, సుబ్బారావు తదితరులు బాలుర మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, బాలుర మృతదేహాలను చూసి కాలనీవాసులు కన్నీటి పర్యంతమయ్యారు.

10 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లి ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణంపై మంగళవారం తన సిబ్బందితో దాడి చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ దీప్తికరంత్ పేర్కొన్నారు. ఈ దాడిలో పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు నిర్వాహకుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనధికారికంగా మద్యం అమ్మకాలు చేపడితే సమాచారం అందించాలని, నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రైల్లో గంజాయి స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం), మే 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైళ్లలో రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా బ్యాగుల్లో గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల వివరాలను రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాలతో మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి వరుసగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. రైల్వే సీఐ ఏ సుధాకర్ తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి నెల్లూరు, కావలి, గూడూరు రైల్వే స్టేషన్లలో రైళ్లలో తనిఖీలు చేశారన్నారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో పూరి-తిరుపతి పూరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేస్తుండగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేరళ రాష్ట్రం మళపురం జిల్లాకు చెందిన మహమ్మద్ ఉబయ్ ఎస్‌పీపీ, అదే రాష్ట్రం ఎర్నాకుళంకు చెందిన సాధిక్యూ పీఏలను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారి నుంచి రూ.60 వేల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు. ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి తమ ప్రాంతంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు నిందితులు విచారణలో తెలిపారన్నారు. సీఐ సుధాకర్, ఎస్‌ఐ ఎన్ హరిచందన, సిబ్బంది రవి, వెంకటేశ్వర్లు, మణికంఠను డీఎస్పీ అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 500



ప్రసన్న ఆంజనేయుడికి సహస్ర ఘటాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), మే 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం 1008 కుండల నదీ జలాలతో విశేష అభిషేకం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అన్నమాచార్య జయంతి సందర్భంగా సాయంత్రం గుండాల గురవయ్య భజన మండళ్ల అన్నమయ్య కీర్తనలను ఆలపించాయి.

నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగంలో మార్పులు, చేర్పులు మొదలయ్యాయి. కొత్త ఆర్‌ఐలు రానున్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్‌ఐలకు అదనంగా ఇంకొందరిని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు అధికార పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే నూతన ఆర్‌ఐలుగా గతంలో ఆర్‌ఐగా పనిచేసిన వారిని తిరిగి తీసుకుంటారా...?, లేక పలు సచివాలయాల్లో అడ్మిన్లుగా ఉన్న వారికి అవకాశం కల్పిస్తారా....? అన్నది సందిగ్ధంగా మారింది. దీనికి తోడు ప్రస్తుతం ఆర్‌ఐలుగా కొనసాగుతున్న వారిలో ఒకరిద్దరికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒక ఆర్వోను బదిలీ చేసిన కమిషనర్, పాత వారిలో ఇద్దరికి ఆర్వోలుగా అవకాశం కల్పించారు.

నగరానికి కొత్త ఆర్‌ఐలు

- మంత్రి ఆదేశాలతో నిర్ణయం
- రెవెన్యూలు మార్పులు, చేర్పులు
- అవకాశం ఎవరికి?
- వచ్చేది అడ్మిన్లా... పాత ఆర్‌ఐలా...!
- ఒకరిద్దరికి ఉద్వాసన..?

నెల్లూరు(సిటీ), మే 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో 54 మున్సిపల్ డివిజన్లు ఉండగా ఆర్‌ఐలు మాత్రం ఆరుగురే ఉన్నారు. వీరిపై ఒకరు ఆర్వోగా వ్యవహరిస్తున్నారు. ఈ విభాగానికి డీసీ ఉన్నతాధికారిగా కొనసాగుతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సుమారుగా రూ. 160 కోట్ల రెవెన్యూ వసూళ్లు చేయాల్సిన బాధ్యత వీరందరిపై ఉంది. అయితే ఇటీవల మంత్రి నారాయణ జరిపిన సమీక్షలో రెవెన్యూ వసూళ్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. డివిజన్ల వారీగా రావాల్సిన పన్నులు, బకాయిదారుల ఐదేళ్ల ట్రాక్ రికార్డును బయటకు తీయాలని ఆదేశించారంటే రెవెన్యూ విభాగం ఏ స్థాయిలో విఫలమైందో అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రెవెన్యూలో పనిచేస్తున్న వారి సామర్థ్యం సరిపోవడం లేదని గ్రహించిన మంత్రి, మరికొంత మంది ఆర్‌ఐలను నియమించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆ మేరకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.



కొత్త ఆర్‌ఐలు ఎవరు...?

కొత్తగా వచ్చే ఆర్‌ఐలు ఎవరనేది ప్రస్తుతం చర్చగా మారింది. గతంలో పని చేసిన అనుభవం ఉన్న వారినే మళ్లీ తీసుకుంటారా..?, లేక పలు సచివాలయాల్లో అడ్మిన్లుగా ఉన్న వారికి అవకాశం కల్పిస్తారా...? అన్న సందిగ్ధం నెలకొంది. అధికార పార్టీ నుంచి ఎవరి సిఫార్సు లేఖలు అందుతాయన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే పాత ఆర్‌ఐలు అనేక మార్గాల ద్వారా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుండగా, సచివాలయ అడ్మిన్లు కూడా వారి ప్రయత్నాలకు పదును పెట్టినట్లు తెలిసింది. కాగా, ఇప్పటి వరకు ఇనయతుల్లా ఒక్కరే ఆర్వోగా కొనసాగుతుండగా, ఆయనను ఇంజనీరింగ్ విభాగానికి పంపిన కమిషనర్, గతం లో ఆర్వోలుగా పనిచేసిన సమ్మద్, శ్రీనివాసరావుకు తిరిగి అవకాశం కల్పించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు బయటకు రావడంతో రెవెన్యూలో మరిన్ని బదిలీ లుంటాయన్న సంకేతాలు వెలువడ్డాయి.

ఒకరిద్దరికి ఉద్వాసన?

ప్రస్తుత ఆర్‌ఐల్లో ఒకరిద్దరికి ఉద్వాసన పలుకుతారన్న ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఒక ఆర్‌ఐ తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీఎల్టీలు లేకుండానే నూతన భవనాలకు కొత్త అసెస్‌మెంట్లు వేసి రూ. లక్షల్లో సొమ్ము చేసుకున్నాడన్న విమర్శలున్నాయి. ఒక కొత్త భవనానికి సంబంధిత సచివాలయం నుంచి కాకుండా మరొక సచివాలయం నుంచి పన్ను జనరేట్ చేసి ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురయ్యాడు. అనుచిత వ్యాఖ్యలతో సచివాలయ అడ్మిన్ల నిరసనను మూటగట్టుకున్నాడు. అంతేకాదు, రీసర్వేలో ఓ భవనానికి పన్ను తగ్గించాడన్న ఆరోపణలతో తాజాగా షోకాజు నోటీసులు అందుకున్నాడు. దీంతో ఆయనను ఆర్‌ఐగా తప్పించాలని దాదాపుగా నిర్ణయించినట్లు తెలిసింది. అయితే, ఓ అధికారి ఇతనికి అండగా ఉన్నట్లు సమాచారం.

ఆర్‌ఐ, అడ్మిన్‌కు షోకాజు నోటీసు

- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలన్న కమిషనర్

నెల్లూరు(సిటీ), మే 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ ఆర్‌ఐ వంశీనాథ్‌రెడ్డికి కమిషనర్ వైవో నందన్ మంగళవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. 9వ ఎలక్షన్ డివిజన్ పరిధిలోని బంగాతోట వద్ద ఓ ఇంటికి సంబంధించి పన్ను వసూళ్లు చేయలేదన్న కారణంగా కార్పొరేషన్ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు తేల్చిన ఆయన, అందుకు బాధ్యుడ్ని చేస్తూ షోకాజు నోటీసు జారీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సదరు ఇంటి నుంచి ఒక్క రూపాయి కూడా పన్ను వసూలు చేయకపోవడం గమనార్హం. ఆర్‌ఐతోపాటు స్థానిక సచివాలయ అడ్మిన్ రాధకు కూడా షోకాజు నోటీసును జారీ చేశారు.

శంభో శంకర!

- వైభవంగా విశ్వనాథుడి రథోత్సవం



రథోత్సవానికి స్వామి, అమ్మవార్లను తరలిస్తున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), మే 13 (ఆంధ్రజ్యోతి) : శంభో శంకర.. హర హర మహాదేవ.. నామ స్మరణతో నగరంలోని ఉస్మాన్‌సాహెబ్ పేట, స్టోన్‌హౌస్‌పేట వీధులు మారుమోగాయి. అక్కడి అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉభయకర్తలు ముంగమూరు చైతన్యరెడ్డి, శ్వేతమ్మ, పత్తి జయరామయ్య నాయుడు, పద్మావతమ్మ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి, గుమ్మడికాయ, కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, బ్యాండు కచేరీ, బాణా సంచా వేడుకలతో రథోత్సవం సాగింది. ఎండ మండిపోతున్నా రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. భక్తులు ఇంటింటా స్వామివారికి కర్పూర నీరాజనాలు అర్పించారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు, పుచ్చకాయలు, ఐస్‌క్రీమ్ వంటి వాటిని స్థానికులు, వ్యాపారులు అందజేశారు. ఉత్సవాన్ని ఈవో దర్గయ్య, అర్చకులు వందవాసి విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ పర్యవేక్షించారు. అనంతరం కోదండరామస్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ జరిగింది. దాతలుగా ఆడిటర్ ఎస్‌వీఎస్ రాఘవేంద్ర రావు, పత్తి జయరామయ్యనాయుడు, మోదెం మల్లికార్జునరావు, కొలపర్తి రమేష్‌కుమార్, వేమూరు కిషోర్, మురారిశెట్టి, కన్నయ్య శెట్టి, తదితరులు వ్యవహరించారు.



రథోత్సవంలో భక్తుల సందడి

వాట్సప్ గవర్నెన్స్‌తో విద్యుత్ సేవలు

- ఎస్‌ఈ విజయన్ వెల్లడి

నెల్లూరు (జడ్పీ), మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వినియోగదారులందరూ అన్ని రకాల విద్యుత్ సేవలను వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పొందవచ్చని విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. విద్యుత్ భవన్‌లో నెల్లూరు టౌన్, రూరల్ డివిజన్ల అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష జరిపారు. వాట్సప్ గవర్నెన్స్ 95523 00009 నెంబరును విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దాని ద్వారానే వినియోగదారులు అన్ని సేవలను పొందవచ్చని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, దీని వల్ల సంస్థకు నష్టం జరుగుతోందని చెప్పారు. ఫెయిల్యూర్స్‌ను భారీగా తగ్గించాలని ఆదేశించారు. సోలార్ విద్యుత్‌పై మరింత విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోలార్ విద్యుత్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు బెనర్జీ, రమేష్ చౌదరి, శ్రీనివాసులు, సోమశేఖర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నేడు విద్యుత్ కోత

నెల్లూరు (జడ్పీ), మే 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొదలకూరు రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో విద్యుత్ స్తంభాలు మారుస్తున్నందున బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్యాన్సర్ హాస్పిటల్ సెంటర్, జడ్పీ కాలనీ, సారాయి అంగడి, పద్మావతి సెంటర్, నేతాజీ నగర్, గౌతమి నగర్, పొదలకూరు రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

వేదగిరి భక్తులకు అన్నదానం

నెల్లూరు రూరల్, మే 13,(ఆంధ్రజ్యోతి) : వేదగిరి నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు తరలివస్తున్న భక్తులకు జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున్ యాదవ్ అన్నదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రథోత్సవానికి వచ్చిన భక్తులకు దేవరపాళెంలో అన్నదానం చేశారు. ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్నదానం చేయడం తమ కుటుంబం ఆనవాయితీ అని, దానిని కొనసాగిస్తున్నామని చెప్పారు.

అండాశయంలో 9 కిలోల గడ్డ తొలగింపు

- జీజీహెచ్‌లో విజయవంతంగా శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), మే 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో క్లిష్టమైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ గర్భకోశ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ గీతాలక్ష్మి మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. నగరంలోని పద్మావతి సెంటర్‌కు చెందిన విజయలక్ష్మి(46) అనారోగ్యంతో జీజీహెచ్‌కు వచ్చిందన్నారు. పరీక్షించి కడుపులో 9 కిలోల గడ్డ ఉన్నట్లు నిర్ధారించామన్నారు. శస్త్రచికిత్స చేసి ఆ గడ్డను, గర్భాశయాన్ని తొలగించినట్లు చెప్పారు. ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.లక్ష వరకు ఖర్చయ్యే చికిత్సను ఉచితంగా చేసినట్లు పేర్కొన్నారు. డాక్టర్ సుజాత, డాక్టర్ హిమబిందు, డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ గ్రేస్ ప్రియాంక, డాక్టర్ సురేష్ సహకారంతో ఆపరేషన్ చేసినట్లు తెలిపారు.

అన్న క్యాంటీన్లు ఆదర్శవంతంగా ఉండాలి

- అధికారులతో సమీక్షలో కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మే 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అన్న క్యాంటీన్లు రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా ఉండేలా నోడల్ అధికారులు బాధ్యత తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో అధికారులతో సమీక్ష జరిపారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న ఏడు క్యాంటీన్లను నోడల్ అధికారులు తరుచూ తనిఖీ చేసి ఆహార నాణ్యత పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రెవెన్యూ విభాగంపై సమీక్ష జరిపారు. రీ సర్వే ఆధారంగా పన్నులను అప్‌డేట్ చేయాలని, రెవెన్యూ వసూళ్ల, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కాగా, 9వ డివిజన్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ చెన్నుడు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న నగర కమిషనర్ నందన్

అమరావతి నేతకు పదవిపై హర్షం

నెల్లూరు(హరనాథపురం), మే 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా అమరావతి జేఏసీ నేత రాయపాటి శైలజను ప్రభుత్వం నియమించటం హర్షణీయమని భారత్ సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసమాన పోరాట పటిమగల శైలజకు పదవి ఇచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సమస్యల పరిష్కారం కోసం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న సీహెచ్‌వోలు

ఒంటి కాలిపై నిరసన

నెల్లూరు (వైద్యం), మే 13 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలంటూ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు(సీహెచ్‌వో) ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. నెల్లూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వారు చేస్తున్న సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గర్భవతులు, బాలింతలు సహా సీహెచ్‌వోలు ఒంటి కాలిపై నిలబడ్డారు. నాయకుడు భాను మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీహెచ్‌వోలకు ఆసుపత్రుల అద్దె బకాయిలు, తదితరాల కింద ప్రభుత్వం రూ. 77.33 కోట్లు జమ చేస్తామని చెప్పి అమలు చేయలేదని ఆరోపించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సంఘం జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్, ఉపాధ్యక్షురాలు రెబెనా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మే డే సాంస్కృతిక ఉత్సవాలు

నెల్లూరు (వైద్యం), మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆత్మకూరు బస్టాండ్ నుంచి పూలే బొమ్మ వరకు ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు హాజరై ప్రసంగించారు. కార్మికులు నిత్యం ఎంతో కష్టపడుతూ విశ్రాంతి లేకుండా జీవనం సాగిస్తారన్నారు. అలాంటి వారిని సంఘటితం చేసి వారికి సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమానికి అమలు చేస్తున్న ఈ-శ్రమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన కార్మికులకు బహుమతులు అందజేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు కత్తి శ్రీనివాసులు, కాయం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్మికశాఖ ఉపకమిషనర్ వెంకటేశ్వరరావు

మంత్రి జనార్దన్‌రెడ్డితో జెడ్‌ఎస్‌ఆర్, మాలేపాటి భేటీ

నెల్లూరు (వైద్యం), మే 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఇటీవల నామినేటెడ్ పదవులు పొందిన డాక్టర్ జెడ్ శివప్రసాద్, మాలేపాటి సుబ్బానాయుడు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్‌గా డాక్టర్ శివప్రసాద్, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాలేపాటి సుబ్బానాయుడు ఎన్నికైనందుకు మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గూటూరు కన్నబాబు కూడా పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శివప్రసాద్, పక్కన మాలేపాటి, గూటూరు

దంపతుల అన్యోన్యతతో గృహస్థాశ్రమ పరిపూర్ణత : స్వామీ గంభీరానంద

నెల్లూరు (సాంస్కృతికం) మే 13 (ఆంధ్రజ్యోతి) : గృహిణి సహకారం లేకుండా గృహస్తుడు ఏమీ చేయలేడని, భార్య సారథి అయితే భర్త రథికుడని, దంపతుల అన్యోన్యతతోనే గృహస్థాశ్రమ పరిపూర్ణత కలుగుతుందని స్వామి గంభీరానంద భారతి తెలిపారు. నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆదిశంకరాచార్య సంస్మరణోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. కఠోపనిషత్‌పై ఆయన ప్రవచనం చేశారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, పరివారి దేవతలకు పుష్పాభిషేకం, పూజలు జరిపారు. టేకుమళ్ల చిదంబరి సంగీత కచేరీ అలరించింది. మందిరం మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్, కార్యదర్శి ములుమూడి ఉదయకుమార్, మేనేజర్ సమయానందస్వామి పాల్గొన్నారు.



గంభీరానంద స్వామికి సత్కారం

నిరాశ్రయులను ఆదరించాలి

నెల్లూరు (వైద్యం), మే 13 (ఆంధ్రజ్యోతి) : వయో వృద్ధులు, అనాథలు, నిరాశ్రయులను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పీ హెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ వెల్లడించారు. పాతమున్సిపల్ కార్యాలయంలోని నిరాశ్రయుల కేంద్రంలో ప్రశాంతి మెమోరియల్ సోషల్ సర్వీస్ సొసైటీ మంగళవారం అన్నదానం చేసింది. ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య పోకడల నేపథ్యంలో తల్లిదండ్రులు, వృద్ధులపై గౌరవం తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయ ప్రకాష్, రమాదేవి, కీర్తన, ఈశ్వర్, గిరేంద్ర, మహదేవ్, బన్ని, సుమంత్, సుందరం తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలకు క్రీడా పరికరాల పంపిణీ

నెల్లూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి) : శాప్ ఆదేశాల మేరకు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న 71 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు మంగళవారం క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కార్యక్రమానికి అతిథిగా హాజరై కోచ్‌లకు పరికరాలు అందించారు. క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించే ఈ శిబిరాలను యువత సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, డీఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడా పరికరాలు అందిస్తున్న గిరిధర్‌రెడ్డి, డీఎస్‌డీవో తదితరులు

సీబీఎస్‌ఈలో జిల్లాకు ఉత్తమ ఫలితాలు

నెల్లూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్‌ఈ సిలబస్ టెన్త్, ఇంటర్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాలోని పలు పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. కొత్తూరు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు వందశాతం ఫలితాలు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే శంకరయ్య మాట్లాడుతూ టెన్త్‌లో 500 మార్కులకు కే ధాత్రి 473, జీ తన్వి 453, వీ శ్రీనివాసవర్మ 450 మార్కులు సాధించారని చెప్పారు. 12వ తరగతి(ఇంటర్)లో 500 మార్కులకు పీ హనుష్ 425, వీ పల్లవి 409, కే దీపిక 384 మార్కులు సాధించారన్నారు. టెన్త్‌లో 67 మంది, ఇంటర్‌లో 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వారిని అభినందించారు.

- 'నారాయణ' విద్యార్థుల ప్రభంజనం

సీబీఎస్‌ఈ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలి పారు. నగరంలోని గోమతి నారాయణ పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



ఓవెల్ స్కూల్లో విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు, యాజమాన్యం

టెన్త్‌లో తమ విద్యార్థులు ఎస్‌కే ఫైజా 493, గీతామృత 491 మార్కులు సాధించి జిల్లాలో అగ్ర స్థానంలో నిలిచారన్నారు. ఇంటర్ ఎంపీసీలో చరణ్ ప్రీత్ 430, బైపీసీలో సుభాష్ శంకర్ 487 మార్కులు సాధించారన్నారు.

- 'ఓవెల్' విద్యార్థుల ప్రతిభ...

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో ఓవెల్ విద్యాసంస్థల విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారని ఆ సంస్థ డైరెక్టర్ ఆర్ వేణు తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెన్త్‌లో పోలిశెట్టి హిమశ్రీ 474, ఎస్‌కే నేహభాను 460, మామిడి కార్తీక్ 448 మార్కులు సాధించారన్నారు. వీరితోపాటు 42 మంది ప్రథమ, ముగ్గురు ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఆర్ ప్రమీల, జీఎం మహదేవ్, ఈడీ బాలు, డీజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

- సిల్వర్ వోక్స్ స్కూల్ ప్రతిభ

నెల్లూరు రూరల్ : సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో తమ స్కూల్ ఉత్తమ ప్రతిభ కనబరిచిందని సిల్వర్ వోక్స్ స్కూల్ డైరెక్టర్లు షణ్ముగ ఆచారి, వెంకటాద్రి నాయుడు తెలిపారు. పార్థసారథి నగరంలోని ఆ పాఠశాలలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. తమ విద్యార్థులు వింజరపు యశస్వి 472, వడ్లమూడి వర్షిత 457 మార్కులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, విజయ తదితరులు పాల్గొన్నారు.

వసంతోత్సవంతో శోభిల్లిన కోన



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం

రాపూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : నరసింహుడికి చక్రతీర్థ స్నానం, స్వామివారి సేవ ముందు నృత్యం, వసంతకేళిలో అధికారులు, భక్తులు వసంతోత్సవ శోభతో పెంచలకోన శోభిల్లింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాంతముగా జరిపే పర్వం చక్రతీర్థ మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత పుణ్యాహవాచన పూజలు నిర్వహించిన పూజారులు వసంతకేళి జరిపారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్యచక్రత్ ఆళ్వర్ల స్నాన ఘట్టాలు కొనసాగాయి. మంగళవాయిద్యాల నడుమ అర్చకులు, భక్తజనులు, దేవస్థాన సిబ్బంది తిరువీధి సేవోత్సవంలో పసుపు, కుంకుమ, గంధం, వివిధ సుగంధాలు వెదజల్లే రంగుల్లో వసంతకేళి నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో శ్రీనివాసులు రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల సతీమణి సింధు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవారిని, ఆంజనేయ స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు, మర్రిపాడు ఎస్‌ఐలు వెంకట రాజేష్, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



వసంతోత్సవ కేళిలో చైర్మన్ తిరుపాల్ రెడ్డి, ఈవో, ఎమ్మెల్యే సతీమణి సింధు తదితరులు

- పెంచలోరికి చక్రతీర్థ స్నానం, తెప్పోత్సవం
- ముగిసిన బ్రహ్మోత్సవాలు, నేడు గోనుపల్లికి శ్రీవారు

● నయనానందకరంగా తెప్పోత్సవం

మంగళవారం సాయంత్రం ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకొచ్చారు. అనంతరం రాత్రి 8 గంటల ప్రాంతంలో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత ఆలయంలో ఎగరవేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని దించి ధ్వజారోహణం కార్యక్రమాన్ని జరిపారు. ఇక చివరిరోజు అయిన బుధవారం రాత్రి గోనుపల్లిలో గ్రామోత్సవం జరగనుంది.

● హుండీ ఆదాయం రూ.25,51,088

బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసిన హుండీలకు భక్తులు భారీగా కానుకలు సమర్పించినట్టు ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మంగళవారం హుండీలను లెక్కించగా, రూ.25,51,088 నగదు, 38 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. అమెరికా 10 డాలర్లు, కువైట్ 7.5 దినార్లు, శ్రీలంక 500 రూపాయల నోటు వచ్చినట్లు తెలిపారు.

టెన్త్, ఇంటర్ సీబీఎస్‌ఈ ఫలితాల విడుదల

నెల్లూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) టెన్త్, ఇంటర్ ఫలితాలు మంగళవారం విడుదల య్యాయి. జిల్లాలో 98 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితా లను బోర్డు అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచి నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. వీటితోపాటు డిజిలాకర్, పరీక్షాసంగమ్ నుంచి కూడా ఫలితాలను తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ రోల్ నంబర్‌లు, స్కూల్ నంబర్లతో ఫలితాలు పొందవచ్చని పేర్కొన్నారు. సీబీఎస్‌సీ వార్షిక పరీక్షలను ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి దాదాపు నెలరోజులు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా టెన్త్‌లో 1,370 మంది, ఇంటర్‌లో 412 మంది కలిపి మొత్తం 1,782 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. టెన్త్ విద్యార్థులు 98శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్ విద్యార్థులు 96శాతం పాసైనట్లు సీబీఎస్‌ఈ విద్యాసంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 11,781 మంది హాజరు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 11,781 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 11,654 మంది హాజరు కావాల్సిఉండగా 11,268 మంది హాజరయ్యారు. 386 మంది గైర్హాజరయ్యా రు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 549 మంది హాజరు కావాల్సి ఉండగా 513 మంది హాజరయ్యారు. 36 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌ఐవో టీ వరప్రసాదరావు 14 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 7, ఫ్లయింగ్ స్క్వాడ్ 26 కేంద్రాలను పరిశీలించారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- మైపాడు, ఎన్‌పీఎస్ రోడ్ల పనులు రద్దు
- వర్కులు జరక్కపోవడంతో ప్రభుత్వం నిర్ణయం
- ఫలించని ఆయా ఎమ్మెల్యేల ప్రయత్నాలు
- మళ్లీ ఎప్పటికి మంజూరయ్యేనో!?

నెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : గతేడాది అక్టోబరులో ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని రూ.120 కోట్ల విలువైన రోడ్ల పనులను ప్రభుత్వం రద్దు చేసింది. నెల్లూరు-మైపాడు రోడ్డు, నెల్లూరు-పొదలకూరు-సైదాపురం (ఎన్‌పీఎస్) రోడ్డు, కలిగిరి-ఓబులేటివారిపాలెం, గూడూరు-తురిమెర్ల రోడ్లు ఈ రద్దు జాబితాలో ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం తర్వాత నెల్లూరు-మైపాడు రోడ్లు, ఎన్‌పీఎస్ రోడ్ల రద్దు నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని, ఆ పనులను పునరుద్ధరించాలని ఆయా ఎమ్మెల్యేలు తీవ్రంగా యత్నించారు. అయితే వీరి విన్నపాన్ని ప్రభుత్వం తిరస్కరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకటే పాలసీ తీసుకున్నందున ఈ రోడ్లను రద్దు జాబితా నుంచి మినహాయించలేమని ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ సెక్రటరీ కాంతీలాల్ దండే ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 12 రోడ్లను పునరుద్ధరించాలంటూ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) పంపిన లేఖను పరిగణలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. దీంతో నెల్లూరు-మైపాడు రోడ్డు, ఎన్‌పీఎస్ రోడ్డు పనులు జరుగుతాయన్న ఆశలు ఆవిరయ్యాయి.

● నెల్లూరు-మైపాడు రోడ్డు

నెల్లూరు-మైపాడు రోడ్డు అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సీఆర్‌ఎఫ్ కింద రూ.48 కోట్లను మంజూరు చేసింది. 2023, డిసెంబరులో ఈ రోడ్డుకు టెండర్ పిలిచారు. నాడు ఐదుగురు కాంట్రాక్టర్లు టెండర్లు వేసి అంతా రింగ్ అయ్యి ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అందరూ తలా కొద్ది వర్కు చేసేలా అనధికార ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు నాటి వైసీపీ నేతలు మధ్యవర్తిత్వం చేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ల మధ్య సఖ్యత కుదరకపోవడంతో రోడ్డు పనులు మొదలుపెట్టలేదు. ఇక కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ రోడ్డుకు గ్రహణం వీడలేదు. ఓ కాంట్రాక్టర్ ఈ రోడ్డు వర్కు మొత్తాన్ని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేయడంతో గతేడాది అక్టోబరు వరకు పనులు మొదలుకాలేదు. ప్రభుత్వం రద్దు ఉత్తర్వులు ఇచ్చాక హడావిడిగా పనులు మొదలుపెట్టి 25 శాతం పనులు చేశారు. బాగున్న రోడ్డు మీద సగం, సగం పనులు చేసి ఆపేయడంతో ప్రజలకు అసౌకర్యంగా మారింది.



అర్ధంతరంగా ఆగిపోయిన నెల్లూరు-మైపాడు రోడ్డు పనులు

● దారుణంగా సైదాపురం

ఎన్‌పీఎస్ రోడ్డు పొదలకూరు నుంచి సైదాపురం వెళ్లే మార్గం చాలా దారుణంగా ఉంది. ఈ రోడ్డును 35/6 కి.మీ నుంచి 54/4 కి.మీ వరకూ అభివృద్ధి చేసేందుకు సీఆర్‌ఎఫ్ కింద రూ.45 కోట్లు మంజూరయ్యాయి. ఈ వర్కుకు కూడా దాదాపు రెండేళ్ల క్రితం టెండర్లు జరగ్గా కాంట్రాక్టర్ నెమ్మదిగా పనులు చేశారు. గతేడాది ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చే నాటికి ఈ రోడ్డు పనులు 25 శాతం పూర్తికాకపోవడంతో ప్రభుత్వం రద్దు చేసింది. ఈ రెండు రోడ్డు వర్కులకూ కేంద్రం నిధులు సమకూర్చుతున్నా కాంట్రాక్టర్లు పనులు చేయలేదు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లుల సమస్యతో పనులు జరగలేదు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం మారినా పనులు జరగకపోవడం గమనార్హం. నిర్ణీత సమయంలో పనులు చేయని కారణంగా ఈ రెండు ముఖ్యమైన రోడ్డు పనులు ఇప్పుడు రద్దవడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ రెండు రోడ్లకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా వాటిని పునరుద్ధరించాలంటూ కోవూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ ఆర్‌అండ్‌బీ మంత్రికి లేఖలు రాశారు.

కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 11వ తరగతికి ఈనెల 14 నుంచి 24వతేదీ వరకు అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సి పాల్ కే శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 37 సీట్లు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు నిర్దేశిత తేదీల్లో ఉద యం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు విద్యాలయం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలే కాకుండా ఇతరులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దేశ రక్షణ నిధికి టిడ్కో చైర్మన్ రూ.లక్ష విరాళం

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), (ఆంధ్రజ్యోతి) : దేశ రక్ష ణ నిధికి మే నెల జీతం నుంచి రూ.లక్ష విరాళంగా ఇస్తున్నట్లు జనసేన పార్టీ నెల్లూరు జిల్లా ఇన్ చార్జి, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశం కోసం బిడ్డను పోగొట్టు కున్న తల్లిదండ్రులకు ఏమి ఇచ్చినా రుణం తీర్చుకోలే మన్నారు. జనసేనాని పవన్ కల్యాణ్ సొంత నిధులు రూ.25 లక్షలు ఇచ్చి, ఆ కుటుంబానికి ఆర్థిక ఊరట కలిగిస్తాయని చెప్పిన మాటలతో స్ఫూర్తి పొంది రూ.1లక్ష విరాళం ఇస్తున్నట్లు తెలిపారు.

నేడు నృసింహుడి కల్యాణం

వింజమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్లలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఎల్వీ కొండారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొనాలని ఆయన కోరారు. భక్తులకు అన్నప్రసాదం, మజ్జిగ అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కల్యాణోత్సవానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్నారని తెలిపారు.

కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

- ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



నెల్లూరు ప్రధాన బస్టాండు వద్ద ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ప్రధాన ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు హెచ్చరించారు. నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఉన్న డీపీటీ కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత కార్మికులకు అప్పటి వరకు ఉన్న సౌలభ్యాలు, ఎస్‌ఆర్‌బీఎస్, ఎస్‌పీవోటీ రద్దు చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న ఓపీఎస్ సౌకర్యం కల్పించలేదని, ప్రమోషన్లు ఇవ్వలేదని, ఖాళీలు భర్తీ చేయలేదని ఆరోపించారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కారుణ్య నియామకాలు జరపలేదన్నారు. వీటన్నింటిపై ఇప్పటికే అనేక రకాలుగా నిరసన తెలిపినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర నాయకుడు కే రమణరాజు, జోనల్ నాన్ ఆపరేషన్ కార్యదర్శి ఎం ఎల్లయ్య, జోనల్ వర్కింగ్ అధ్యక్షుడు మాధవరావు, జిల్లా నాయకులు ఎం రామారావు, జానా వెంకటేశ్వర్లు, సీహెచ్ చెంచయ్య, ఆర్ సుబ్బయ్య, టీ మురళీమోహన్ పాల్గొన్నారు.



ఉదయగిరి : మహిళలకు నీళ్ల బిందెలు అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల తదితరులు

అమృతధారకు పునాది ఉదయగిరే!

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి

ఉదయగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): తనకు ఉదయగిరి అంటే ఎనలేని అభిమానమని, అందుకే తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ అమృత ధార పథకాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించినట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరి, జలదంకి, కొండాపురం మండలాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి శుద్ధిజల కేంద్రాలను ఎంపీ వేమిరెడ్డి ప్రారంభించారు. ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లిలో ఎంపీ మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఇప్పటివరకు 170 శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఒక్క ఉదయగిరిలోనే 36 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధానంగా ఫ్లోరిన్ పీడిత ప్రాంతాల్లో శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ అడిగిందే తడువుగా నియోజకవర్గంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు, టీడీపీ నాయకులు మన్నేటి వెంకటరెడ్డి, బయ్యన్న, రియాజ్, బొజ్జా నరసింహులు,సర్పంచి సత్తెనపల్లి వరలక్ష్మి, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేక.. పెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోక !

- భవిష్యత్తులో నష్టపోనున్న కొత్త జంటలు
- విదేశీయానం సందర్భంలో ఇబ్బందులు
- విడాకులు, ఆస్తి వివాదాల్లోనూ ఇక్కట్లే..!

ఆత్మకూరు, మే 13 ఆంధ్రజ్యోతి): నెల్లూరుకి చెందిన ఓ జంట ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. కానీ ఆ పెళ్లిని వారు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. ఇటీవల వారు విదేశాల్లో ఉద్యోగానికి వెళ్లాల్సి వచ్చింది. అందుకు వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి అని చెప్పడంతో హడావిడిగా ఎక్కువ నగదు ఖర్చు పెట్టి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందారు. ఇలా ఎంతోమంది తెలియక వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోతున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. తాజా పరిస్థితుల్లో పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ ఎంతో అవసరం. కొత్తగా ఒక్కటయ్యేవారంతా తప్పనిసరిగా వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాల్సిన అవసరం ఉంది.

● ప్రక్రియ ఎలాగంటే...

వివాహం రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే దరఖాస్తుతో పాటు పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తె శుభలేఖలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు పెళ్లి కుమారుడు తాళి కడుతున్న ఫొటో, తలంబ్రాలు పోస్తున్న ఫొటో, ఇద్దరు వివాహ సమయంలో పూలదండలు మార్చుకునే ఫొటో, ఆధార్ కార్డులు, బర్త్ డే సర్టిఫికెట్ జెరాక్సులు అధికారులకు అందజేయాలి. పదోతరగతి చదివిఉంటే మార్కుల జాబితా నకలు జత చేయాలి. నవ దంపతులు తరుపున ఇద్దరేసి సాక్షి సంతకాలు చేయాల్సి ఉంటుంది.వీటిని ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇస్తే వారు పరిశీలించి మున్సిపాలిటీ కార్యాలయానికి లేదా పంచాయతీ కార్యాలయానికి పంపుతారు. ఆ తరువాత రూ. 530లు చెల్లించి వివాహ రిజిస్ట్రేషన్ పత్రం పొందవచ్చు. అంతేకాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకుని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంది.



● ప్రయోజనాలు ఇవి...

ఉద్యోగులు తమ భార్య లేక భర్త నామినీగా నమోదు చేయాలనుకున్నా, పలు పథకాల్లో లబ్ధి పొందాలనుకున్నా, విదేశాలకు వెళ్లే సమయంలో దంపతులు పాస్‌పోర్ట్‌కు సంబంధించి వీసా, వర్క్ పర్మిట్, బీమా వంటివి పొందాలనుకున్నా వివాహ ధ్రువపత్రం తప్పనిసరి. అనివార్యకారణాల వల్ల దంపతుల మధ్య వివాదాలు తలెత్తినా పోలీసు కేసులు, కోర్టులో సాక్ష్యంగా చూపేందుకు వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం అవసరం అవుతుంది.

జోరుగా పెళ్లిళ్లు

ప్రస్తుతం జిల్లాలో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు పెళ్లిళ్లు, బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి. ఈనెలతో నెలతోపాటు జూన్ మొదటివారం వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్‌తో వధూవరులు సందడి చేస్తున్నారు. అంతా బాగానే ఉన్నా.. నిబంధనల ప్రకారం కల్యాణ క్రతువును రిజిస్ట్రేషన్ చేసుకునే విషయంలో మాత్రం పలువురు శ్రద్ధ చూపడం లేదు.

● 45 శాతం మంది మాత్రమే నమోదు

జిల్లాలో ప్రతిఏటా వేలాది వివాహాలు జరుగుతు న్నాయి. కల్యాణ మండపాలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, ఇళ్ల దగ్గర వివాహాలు జరుగుతుంటాయి. వీటిలో రిజిస్ట్రేషన్లు మాత్రం 45 శాతం మాత్రమే అవుతున్నాయి. చాలామందికి అవగాహన లేకపోవడంతో నమోదు చేసుకోవడం లేదు. అవసరం వచ్చినప్పుడు హడావిడిగా కార్యాలయాల చుట్టూ తిరగడం, రూ. 530 ఖర్చుతో అయ్యేదానికి మధ్యవర్తుల ప్రమేయంతో నాలుగైదు వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. ముందుగానే అప్రమత్తమై రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఎంతో మంచిది.

శాంతియుతంగా మెలగాలి

- దప్పళంపాడు గ్రామస్థులకు సబ్‌కలెక్టర్ శ్రీపూజ సూచన
- 12 మందిని బైండోవర్ చేసుకున్న పోలీసులు



దప్పళంపాడు గ్రామస్థులతో మాట్లాడుతున్న కందుకూరు సబ్‌కలెక్టర్

గుడ్లూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతియుత వాతావరణంలో నడుచుకోవాలని మండలంలోని దప్పళంపాడు గ్రామస్థులకు కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ సూచించారు. దప్పళంపాడులో మూడు రోజుల క్రితం నుంచి ఇరు సామాజిక వర్గాల నడుమ జరుగుతున్న వివాదాల నేపథ్యంలో బాధితులు సోమవారం కందుకూరు సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే, ఈ ఘటనలపై స్పందించిన సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ మంగళవారం దప్పళంపాడుకు చేరుకొని ఇరువర్గాల ప్రజలతో చర్చించారు. వివాదాలకు కారణ ఏమిటని విచారించారు. గత శుక్రవారం రాత్రి గ్రామంలోని ఓ వీధిలో కొందరు యువకులు ద్విచక్ర వాహనాలపై వెళుతూ పెద్దపెద్దగా ఈలలు వేశారని, ఆ ఈలలు వేసింది ఎస్సీ కాలనీకి చెందిన జడ చక్రి, చెరుకూరి కార్తీక్‌లేనని భావించిన పెత్తందార్లు, మరుసటిరోజు ఇద్దరు ఎస్సీలను కొట్టడమే ఈ వివాదానికి కారణమని గ్రామస్థులు తెలిపారు. అయితే కొందరు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఈ విషయాన్ని కక్షపూరితంగా భావించి రెండు మూడు రోజుల నుంచి దళితవాడకు మంచినీరు అందచకుండా, దళితుల పాలు పాలకేంద్రాలకు పోయించుకోకుండా, ఉపాధి పనుల నుంచి వెనక్కి పంపిస్తున్నారని దళితవాడకు చెందిన మహిళలు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, శాంతియుత వాతావరణంలో ఉండాలన్నారు. వివాదాలకు పాల్పడే వ్యక్తులను పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని తెలిపారు. కాగా దళితులపై దాడికి పాల్పడిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన 12 మందిని బైండోవర్ చేసుకు న్నామని గుడ్లూరు ఎస్‌ఐ వెంక ట్రావు తెలిపారు. ఈ విషయం తెలి సుకున్న బీజేపీ నాయకులు దప్పళంపాడుకు చేరుకొని వివాదం జరిగిన తీరుపై విచా రణ చేపట్టారు. అన్యాయం జరుగుతున్న దళితులకు బీజేపీ అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి బైరి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుడ్లూరు మండల అధ్యక్షుడు ఇన్నమూరి ప్రమీల సుధాకర్ పాల్గొన్నారు.

సోమశిలలో 48.744 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 48.744 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 5,880, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసె క్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

బత్తిన సాయికుమార్ రెడ్డి హఠాన్మరణం



సాయికుమార్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం/ వైద్యం), మే 13 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద భావ ప్రచార సమితి అధ్యక్షుడు, ప్రముఖ ప్రవచకుడు బత్తిన సాయికుమార్ రెడ్డి(54) సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు మంగళ వారం అభిమానులు, శిష్యులు, రాజకీయవేత్తలు, మేధావులు, విద్యార్థులు, బంధుమిత్రుల కన్నీటి వీడ్కోలుతో జరిగాయి. పలువురు ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కాగా, సాయకుమార్‌రెడ్డి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. రెడ్‌క్రాస్ ఫౌండర్ సభ్యుడు వాకాటి రవీంద్ర సహకారంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ మంగళ వారం నేత్రాలను సేకరించారు.

అంగన్‌వాడీల్లో పాఠశాల సంసిద్ధత ఉత్సవాలు



చిన్నారులతో సీడీపీవో లక్ష్మీదేవి

నెల్లూరు (హరనాథ పురం), మే 13(ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే చిన్నారుల్లో ఆసక్తి, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన పాఠశాల సంసిద్ధత ఉత్సవాలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. మంగళవారం నెల్లూరులో బాలాజీనగర్ సెక్టార్‌లోని అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ ఉత్సవాలను అర్బన్ సీడీపీవో కరణం లక్ష్మీదేవి ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కార్యకర్తలు ఆటపాటలతో కూడిన విద్యను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ తమలపాకుల అశోక్‌కుమారి, ఎఫ్ఎల్ఎన్‌డీసీ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోండి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 14వేలు, కేంద్ర ప్రభుత్వం మరో రూ. 6వేలు నగదును సాగు ఖర్చులకు అంద చేస్తుందన్నారు. ఈ-కేవైసీ చేయించుకున్న రైతులు ఈ నెల 20లోగా రైతుసేవా కేంద్రాల్లో ఆధార్, ల్యాండ్ సీడింగ్ వివరాలతో సంప్రదించాలని ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9117
వెండి కిలో ధర	రూ. 99,800
వెండి ఒక గ్రాము	రూ.102.80

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి గ్రహణం

● ఆరు రోజులుగా నిలిచిన నీటి సరఫరా ● 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో అధికారులపై ఆరోపణలు ● వివరణ కోరిన వెంటనే సరఫరా ప్రారంభం

మర్రిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో 2019లో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని తీసుకువచ్చింది. ఏటీఎం కార్డు వంటి కార్డులను వినియోగదారులకు అందజేసి, ప్రతీకార్డు రూ.100లతో రీచార్జిచేస్తే 25క్యాన్ల శుద్ధిజలం అందించేలా పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకానికి మర్రిపాడు మండలంలో అధికారులు గ్రహణం పట్టించారు. మండలంలోని 24పంచాయతీల్లో 36 మినీవాటర్ ప్లాంట్‌లు నిర్మించి, అన్నిప్లాంట్‌లకు నీటిని సరఫరా చేసేందుకు ఏడు ట్రాక్టర్లు, ఏడు ట్యాంకర్లను తొలుత ఏర్పాటు చేశారు. ప్లాంట్‌లు ఏర్పాటు చేసి ఆరేళ్లు గడిచినా 14 ప్లాంట్‌లు మాత్రమే వాడుకలోకి వచ్చాయి. మిగిలినవి శిథిలావస్థకు చేరాయి. వీటిని ఏర్పాటుకు కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి ఐదేళ్లు నిర్వహణ చేయాల్సి ఉండగా, ఆ సమయం కూడా గత ఏడాదితో ముగిసింది. అప్పటి నుంచి ఎవరి నిర్వహణ లేకపోకడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే నిర్వహిస్తున్నారు. మండలంలో ప్రస్తుతం వాడుకలో ఉన్న ప్లాంట్‌ల ద్వారా నీటిని సుమారు 1100 కుటుంబాలవారు 1100కార్డుల ద్వారా వాడుతున్నారు. వచ్చే ప్రతీ రూపాయికి సంబంధిత అధికారులే బాధ్యత వహిస్తున్నారు. ఏడు ట్రాక్టర్లకుగాను ఒక్క ట్రాక్టర్ మాత్రమే వాడుకలో ఉంది. మిగిలిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు ఎక్కడ ఉన్నాయో తెలియదు. ఉన్న ఒక్క డ్రైవర్‌కి, వాచ్‌మన్‌కి మాత్రమే జీతం ఇస్తున్నారు. మిగిలిన డబ్బులు ఏమయ్యాయో తెలియదని మండల ప్రజలు వాపోతున్నారు. కాగా అన్నీ ప్లాంట్‌లకు ఆరు రోజుల నుంచి మంచినీటిని సరఫరా చేయకుండా నిలిపివేశారు. అసలే వేసవి కావటంతో మంచినీరు దొరక్క ఆయా గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై ఏఈ కృష్ణని వివరణ కోరగా అక్కడక్కడా ట్యాంక్‌లు రిపేరు వచ్చాయన్నారు. దీంతో గ్రామాల్లో ఆంధ్రజ్యోతి పరిశీలించింది. అప్పుడప్పుడు వస్తున్న చిన్న చిన్న మరమ్మతులు చేస్తున్నారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న అన్నీ ప్లాంట్‌లు బాగానే ఉన్నాయి. అక్కడ కార్డుల రీచార్జి వల్ల వచ్చే డబ్బుల పంపకాల్లో పొత్తులు పోకనే ఉద్దేశ్య పూర్వకంగా నీటిని ఆపేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా మంగళవారం ఉదయం మరోసారి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఫోన్‌లో సంప్రదించగా పరిస్థితులు బాగాలేవంటూ ఫోన్‌కట్ చేశారు. కాగా మంగళవారం ఉదయం నుంచే ప్లాంట్లకు నీటిని సరఫరా చేస్తున్నారు.


మర్రిపాడులోని శుద్ధిజల మదర్ ప్లాంట్

'బెల్టు' నివారించి, ఉపాధి చూపండి!

ఉదయగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల్లో ఉన్న మద్యం బెల్టుషాపులను నివారించడంతోపాటు ప్రతిఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎదుట మహిళలు వాపోయారు. మంగళవారం మండలంలోని వెంకట్రావుపల్లిలో శుద్ధజల కేంద్రం ప్రారంభానికి ఎమ్మెల్యే వచ్చారు. ప్రారంభోత్సవ అనంతరం కొండాయపాళెం మహిళలు గ్రామాల్లో అనధికార మద్యం షాపులు ఉన్నాయని, వాటి నివారించి తమ కుటుంబాలను కాపాడాలని ఎమ్మెల్యేకి విన్నవించారు.ఉపాధి పనులు కల్పించకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నామన్నారు. స్పందించిన ఆయన వెంటనే అక్కడే ఉన్న పోలీసులకు మద్యం బెల్టు షాపులపై దాడులు చేసి నివారించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు.


ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎదుట వాపోతున్న మహిళలు

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణం పూర్తికి చర్యలు

కలువాయి, మే 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆప్షన్-3 కింద చేపట్టి బేస్‌మెంట్లుతో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు హౌసింగ్ ఈఈ మోహన్‌రావు తెలిపారు. కలువాయి, కేసీ గోపవరం, బాలాజీరావుపేట లేఅవుట్‌లలో ఆప్షన్-3 ఇళ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడారు. ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు బేస్‌మెంట్లు వరకు వేసి బిల్లులు తీసుకుని నిలిపి వేశారన్నారు. దీంతో ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారుల ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ ఇళ్లను కాంట్రాక్టర్లు చేతనే పూర్తి చేయిస్తామని, ఇందు కోసం వారితో మాట్లాడుతున్నామని ఈఈ తెలిపారు. ఆయన వెంట డీఈ గౌస్‌మోహిద్దీన్, ఏఈ అక్మల్ ఉన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ మోహన్‌రావు, సిబ్బంది

సాంకేతిక విద్యకు పునాది పాలిటెక్నిక్ కోర్సులు

ఆత్మకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక విద్యకు పునాది పాలిటెక్నిక్ కోర్సులని ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు షేక్ సల్మా తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్‌లో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం, సిరామిక్స్, మైన్స్, ఆటోమొబైల్, కెమికల్ గ్రూపులు ఉన్నాయన్నారు. పాలిటెక్నిక్ కోర్సులు చదివిన విద్యార్థులు త్వరగా ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు డాక్టర్ ఎం ప్రసాద్, తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాలిటెక్నిక్ అధ్యాపకురాలు షేక్ సల్మా

క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

సంగం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగం కొండ అటవీ ప్రాంతంలో సర్వే నెంబరు 361, కంపార్ట్‌మెంట్ నెంబరు 376లో 1.85 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్డు, బిల్డింగ్ మెటల్ క్వారీ ఏర్పాటుకు ఓ ప్రైవేటు వ్యక్తి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది, చివరిగా పంచాయతీలో ప్రజాభిప్రాయం సేకరణకు పూనుకున్నారు.ఇందులో భాగంగా మంగళవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. సభలో పాల్గొన్న గ్రామస్థులు భిన్నభిప్రాయాలు వ్యక్తం చేశారు. మొత్తం 22 మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అధికారులు వారి అభిప్రాయాలను వీడియో రికార్డుతోపాటు మినిట్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దారు సోమ్లా నాయక్, సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్, పర్యావరణ శాఖ ఇంజనీర్లు, పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఉర్దూ గ్రంథాలయంలో అందించే ఉర్దూ, అరబ్బీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ. చెంచల బాబుయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం విద్యార్థులు, నిర్వాహకులు, టీడీపీ నాయకులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి షేక్ జబీన్, టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, కార్యాలయ సబార్డినేట్ షేక్ షఫీ, ముస్లింపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు, గ్రంథాలయ నిర్వాహకులు

పంచాయతీ స్థలం ఆక్రమణ


పంచాయతీ స్థలం ఆక్రమించి వేసిన గడ్డివామి

అనంతసాగరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరులో ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించారు. ఆ స్థలంలో గతంలో తాగునీటి బావి వుండేదని, దాన్ని పూడ్చి గోడ నిర్మించి గడ్డివాము ఏర్పాటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అయినా పట్టించుకొనే వారు కరువయ్యారని వారు వాపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకొని ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయించాలని వారు కోరుతున్నారు.

అక్రమ కట్టడం తొలగింపు


ఆక్రమణదారులను హెచ్చరిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ఉదయగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లో మురుగు కాలువపై పిల్లర్లు ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణం చేపట్టడాన్ని సర్పంచి పావులూరి సామ్రాజ్యం, ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తన సిబ్బందితో అడ్డుకున్నారు. ఓ వ్యాపారి తన దుకాణం ముందున్న మురుగు కాలువపై పిల్లర్లు ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయాన్ని పలువురు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు పోలీసుల సహకారంతో అక్కడికి చేరుకొన్నారు. అక్రమ నిర్మాణానికి తొలగించాలని సూచించారు. అయినా ససేమిరా అనడంతో ఎస్ఐ, అక్రమణదారుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎట్టకేలకు అధికారులు తమ సిబ్బందితో అక్రమణ నిర్మాణాన్ని తొలగించారు.

సుర్రుమంటున్న సూరీడు



మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో సూరీడు సుర్రుమంటున్నాడు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీలు నమోదవుతుండడంతో ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మంగళవారం ఓ పసివాడ్ని తండ్రి గొడుగు నీడలో తీసుకెళుతుండడం కనిపించింది. మరో వారం ఎండలు ఇలానే ఉంటాయని నిపుణులు తెలిపారు.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

టీడీపీ సీనియర్ నేత తిరుపాలయ్య మృతి

వెంకటాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మల్లి తిరుపాలయ్య (65) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. పలువురు మండల నేతలతోపాటు మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాట్ల వెంకటసుబ్బయ్య, వెంకటాచలం మాజీ సర్పంచి వలిపి మునుస్వామి తదితరులు తిరుపాలయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫోన్ ద్వారా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కంప చెట్ల మధ్య బాలుర వసతిగృహం

● ఊరికి దూరం... కొరవడిన మౌలిక వసతులు

ఆత్మకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ జంక్షన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాలుర వసతిగృహంలో మౌలిక వసతులు కొరవడ్డాయి. దీంతో ప్రతి ఏటా విద్యార్థులకు వెతలు తప్పడం లేదు. వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు 80 మంది ఉన్నారు. వసతిగృహానికి ప్రహరీగోడ లేక రక్షణ కరువైంది. పరిసర ప్రాంతాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉండడంతో విషపురుగుల బెడద విద్యార్థులను కలవరపరుస్తున్నది. దానికితోడు వసతిగృహం ఎదుట పెద్ద పెద్దగోతుల్లో నీరు నిల్వ ఉండి దోమలకు నిలయంగా మారాయి. ఈ వసతిగృహం పట్టణానికి దూరంగా ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేసవి సెలవుల్లోనైనా వసతిగృహ సముదాయానికి ప్రహరీగోడ నిర్మించడంతో పాటు పరిసర ప్రాంతాలను చదును చేయాల్సిన అవసరం ఎంతనా ఉంది.


కంపచెట్ల మధ్య ప్రభుత్వ వసతిగృహం

న్యూస్ బాక్స్

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

మర్రిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి) : రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని రైతు సంఘం నాయకులు మూలి వెంగయ్య ఆరోపించారు. పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ మంగళవారం డీసీపల్లి పొగాకు బోర్డులో రైతులు నిరసన తెలిపారు. పెట్టుబడులకు అనుగుణంగా ధరలు ఆశాజనకంగా లేవని, సరైన ధరలు కల్పించాలని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్‌ని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీపీఎం నాయకులు లక్ష్మీపతి, లక్కు ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు



ఉదయగిరి, మే 13: స్థానిక అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వీ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం అధ్యాపకులతో సమీక్ష నిర్వహించి కళాశాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

వైభవంగా ఆంజనేయుడికి ఆకుపూజ


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఆత్మకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హనుమాన్‌జంక్షన్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం కనులపండువగా పత్రపూజ నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, సహస్రనామార్చన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

అనంతసాగరం మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవనగరం జమ్మినగుంటలో వెలసిన శివలింగేశ్వర ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి అభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించారు.

ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రయోగాత్మక విద్య ఎంతో అవసరమని గ్రంథపాలకుడు నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకుడు వేము పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

17న ఏఎస్ పేట మండల సమావేశం

ఏఎస్ పేట,మే13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశంలో తాగనీరు,ఎంజీఎన్ఆర్ఈజీఎస్, వైద్యఆరోగ్య, విద్య,పంచాయతీరాజ్,గృహ,వ్యవసాయ. జలవనరుల శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు,సర్పంచులు,మండల అధికారులు హాజరుకాలని తెలిపారు.

వైభవంగా గంధమహోత్సవం



ఉదయగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్ సమీపంలోని అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌సావలి దర్గా ఆవరణలో ఉన్న హజరత్ ఉస్మాన్‌సావి రహంతుల్లా అలైహి వారి గంధమహోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని మేళతాళాలు, ఫకీరు జరీబులు, బాణసంచాపేలుళ్లు, విద్యుత్ దీపాలంకరణలతో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చదివింపుల అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు.

CRIME NEWS


చందు మృతదేహాన్ని బయటకు తీసుకుని వస్తున్న స్థానికులు

కనిగిరి కాలువలో గల్లంతయిన అన్నదమ్ముల మృతదేహాలు లభ్యం

● మిన్నంటిన కన్నవారి రోదనలు
● స్థానికుల కంటతడి


నందు మృతదేహాన్ని నీటిలో నుంచి గట్టుకు తీసుకువస్తున్న ఈతగాళ్లు

సంగం, మే 13 (ఆంధ్రజ్యోతి): కనిగిరి కాలువలో గల్లంతైన అన్నదమ్ముల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. కోవూరు స్టాబీడీ కాలనీకి చెందిన బందా గోవిందయ్య, శేషమ్మల కుమారులు చందు (14), నందు (11) వేసవి సెలవులకు పది రోజుల కిందట సంగంలోని అమ్మమ్మ, పెద్దమ్మల ఇంటికి వచ్చారు. స్థానిక విద్యార్థులతో కలసి సోమవారం కనిగిరి ప్రధాన కాలువలో ఈతకెళ్లి నీటిలో గల్లంతైన విషయం విదితమే. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులు ఇరిగేషన్ అధికారుల సాయంతో కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో మంగళవారం ఉదయానికి నీటి మట్టం బాగా తగ్గి వారు మునిగిన చోటుకు 200 మీటర్ల దూరంలో చందు మృతదేహం లభ్యమయింది. కాలువ క్రాస్ రెగ్యులేటర్‌కు దిగువున నందు మృతదేహం లభ్యమయింది. రెండు మృతదేహాలను పోలీసులు ఒడ్డుకు చేర్చారు.

● **కొడుకులిద్దరూ ఒకేసారి మృతి**

కొడుకులద్దరినీ ఉన్నత చదువులు చదివించాలని ఆ దంపతులు కలలు కన్నారు. ఈ క్రమంలో సెలవులను ఆనందంగా గడపాలని అమ్మమ్మ ఇంటికి వచ్చి మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆర్తనాదాలు మిన్నంటాయి. వాస్తవానికి వీరిద్దరు రెండు, మూడు సంతానం. మొదటి సంతానం కూడా కుమారుడే. ఏడాది తిరక్కుముందే మృతి చెందాడు. ఆ తరువాత వీరిద్దరు పుట్టారు. పుట్టిన ముగ్గురు కుమారులు ఇలా మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల కడుపుకోత చెప్పనలివి కాకుండా ఉంది.

● **పోస్టుమార్టానికి మృతదేహాల తరలింపు**

వెలికితీసిన మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాలను వారి స్వగ్రామం కోవూరు స్టాబీడీ కాలనీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పరామర్శ**

కోవూరు : సంగం సమీపంలో కనిగిరి కాలువలో ఈతకు వెళ్లి మృతి చెందిన నందు, చందు బాలుర తల్లిదండ్రులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరామర్శించారు. స్థానిక స్టాబీడీ కాలనీలో ఉంటున్న బాలుర తల్లిదండ్రులను బందా గోవిందయ్య, శేషమ్మలను ఎమ్మెల్యే ఓదార్చారు. ఆమె వెంట పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, చెంబేటి పెంచలయ్య, బాలరవి, ముసలి సుధాకర్ తదితరులు ఉన్నారు. అలాగే, సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి మూలం రమేష్, శేషయ్య, సుబ్బారావు తదితరులు బాలుర మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, బాలుర మృతదేహాలను చూసి కాలనీవాసులు కన్నీటి పర్యంతమయ్యారు.

10 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లి ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణంపై మంగళవారం తన సిబ్బందితో దాడి చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్ పేర్కొన్నారు. ఈ దాడిలో పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు నిర్వాహకుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనధికారికంగా మద్యం అమ్మకాలు చేపడితే సమాచారం అందించాలని, నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రైల్లో గంజాయి స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలు తెలుపుతున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం), మే 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైళ్లలో రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా బ్యాగుల్లో గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల వివరాలను రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాలతో మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి వరుసగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. రైల్వే సీఐ ఏ సుధాకర్ తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి నెల్లూరు, కావలి, గూడూరు రైల్వే స్టేషన్లలో రైళ్లలో తనిఖీలు చేశారన్నారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో పూరి-తిరుపతి పూరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేస్తుండగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేరళ రాష్ట్రం మళప్పురం జిల్లాకు చెందిన మహమ్మద్ ఉబయ్ ఎస్‌పీపీ, అదే రాష్ట్రం ఎర్నాకుళంకు చెందిన సాదిక్యా పీపీలను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారి నుంచి రూ.60 వేల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు. ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి తమ ప్రాంతంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు నిందితులు విచారణలో తెలిపారన్నారు. సీఐ సుధాకర్, ఎస్ఐ ఎన్ హరిచందన, సిబ్బంది రవి, వెంకటేశ్వర్లు, మణికంఠను డీఎస్పీ అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 500



గిరిజనులకు దుస్తుల పంపిణీ

కావలి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవంలో భాగంగా మంగళవారం చెరువు కట్ట గిరిజన కాలనీలో నివసించే 90 కుటుంబాలకు దుప్పటి, తువాలు, చీర, లుంగీతో కూడిన దుస్తుల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కే. హరినారపరెడ్డి, కోశాధికారి అరికట్ల మధు, వలంటీర్లు పద్మావతి, దీరజ్, భార్గవ, చరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'వెలుగు' తీరే వేరయా!

- విధి నిర్వహణలో సమయపాలన కరువు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



వెలుగు కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వలేటివారిపాలెం, మే 13(ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో వెలుగు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళుతారో తెలియక ప్రజలు ఇబ్బందులకు గురవుతోన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. దీనిపై కనీసం సమాచారం ఇచ్చే నాథుడు కూడా కరువయ్యారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సొంత మండలం వలేటివారిపాలెంలో వెలుగు సిబ్బంది పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. కార్యాలయానికి ఎప్పుడు వస్తారో.. ఏ సమయంలో ఎక్కడ ఉంటారో కూడా అర్థం కాని పరిస్థితి. డ్వాక్రా మహిళలు వివిధ పనులపై కార్యాలయానికి వెళ్తే అధికారులు, సిబ్బంది ఏ ఒక్కరూ కనిపించరు. మంగళవారం ఉదయం 11 గంటలకు వెళ్తే అకౌంటెంట్ మినహా సీసీలు ఎవరూ కార్యాలయంలో లేరు. నిబంధనల ప్రకారం సకాలంలో విధులకు హాజరై అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి మూమెంట్ రిజిస్టరులో ఎక్కడకి వెళ్లేది.. అందుకు కారణం నమోదు చేయాలి. అయితే సీసీలు అందుకు వి రుద్ధంగా వ్యవహరిస్తూ విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలో పోకూరు, చుండి, శింగమనేనిపల్లె, వలేటివారిపాలెం క్లస్టర్లు ఉండగా ముగ్గురు సీసీలు ఉండగా ఒక సీసీ పోస్టు ఖాళీగా ఉంది. కందుకూరు ఏపీఎం సురేష్ వలేటివారిపాలెం ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండలంలో 31 మంది యానిమేటర్లు ఉన్నారు. 1104 గ్రూపులు ఉన్నాయి. అయితే సంఘాలు బలోపేతంపై సిబ్బంది దృష్టి సారించకపోవడంతో గ్రామ సంఘాలు బలహీనపడుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతోన్నాయి. ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో మండల సమైక్య, సీసీలు, ఏపీఎం, పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో గోప్యంగా సమావేశాలు నిర్వహించడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. అటు పాలకులు, ఇటు ఉన్నతాధికారుల కళ్లుకప్పి సిబ్బంది విధులను నామమాత్రంగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెలుగు కార్యాలయ సిబ్బందిపై దృష్టి సారించి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘం సభ్యులు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

సిబ్బంది తప్పకుండా కార్యాలయానికి వెళ్లి హాజరు రిజిస్టరులో సతకం పెట్టి ఎక్కడికి వెళ్తుంది మూమెంట్ రిజిస్టర్‌లో కారణం నమోదు చేయాలి. సమావేశాలు గోప్యంగా కాకుండా మీడియాకు తెలియజేసేలా చర్యలు చేపడతాం. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు.

- సురేష్, ఇన్‌చార్జి ఏపీఎం, వలేటివారిపాలెం

ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుంటాం

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
- ఎమ్మెల్యే కాకర్లతో కలిసి శుద్ధి ప్లాంట్ల ప్రారంభం



కొండాపురం : మహిళకు తాగునీరు అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చేందుకు వీపీఆర్ ఫౌండేషన్ ముందుంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని భీమవరప్పాడు ఎస్సీ కాలనీలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృతధార మంచినీటి ఆర్వో ప్లాంటును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలసి ఎంపీ వేమిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటు నిర్వహణకు ప్రత్యేకంగా ఒక టీమును ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ ట్రైసైకిళ్లు అందచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు విడవలపాటి శ్రీనివాసులు(గురుదేవ్), జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, టీడీపీ కన్వీనర్ ఎం.ఓంకారం, నాయకులు చాగంటి క్రిష్ణ, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, యారవ కృష్ణయ్య, పీ.చంద్రబాబునాయుడు, గంటా నరసింహులు, పీ.రమేష్, పాల్గొన్నారు.

జలదంకి: మండలంలోని చినక్రాక, బ్రాహ్మణక్రాక, తొమిదోమ్మైలులో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్మించిన అమృతధార మంచినీటి శుద్ధి కేంద్రాలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదప్రజలు అంటురోగాల నుంచి బయటపడే ఉద్దేశంతో వీపీఆర్ అమృతధార మంచినీటి శుద్ధి జలాల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంపై ఎంపీ వేమిరెడ్డికి ప్రత్యేక అభిమానం ఉందన్నారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతం కావడంతో అధికంగా నియోజకవర్గంలో అమృతధార ప్లాంట్లు ఏర్పా టు చేస్తుండడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కావలి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు వంటేరు వేణుగోపాల్‌రెడి, కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, బ్రాహ్మణక్రాక సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఇండ్ల సుధాకర్, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, చినక్రాక ఎంపీటీసీ గొర్రెపాటి యలమందారెడ్డి, నాయకులు మధురెడ్డి, జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

ఉలవపాడు, మే 13(ఆంధ్రజ్యోతి) : ఉలవపాడులో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వీ.శ్రీనివాస్, దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్త సుదీష్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం ఆరుబయట మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితుల పర్యవేక్షణలో జరిగే స్వామివారి కల్యాణంకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, నెల్లూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన పుష్పక రథంపై తిరువీధుల్లో రథోత్సవం జరుగుతుందని తెలిపారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి):మైనారిటీ రాయితీ రుణాలకు ఈనెల 25లోగా ఓబీఎంఎంఎస్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 55 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ముస్లిం వర్గానికి చెందిన బీసీ-బీ, బీసీ-ఈ, ఓసీ ముస్లింలు కూడా అర్హులని తెలిపారు. ఏడాదికి 2లక్షల లోపు ఆదాయం కలిగి తెల్లరేషన్‌కార్డుదారులై ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. రవాణా పథకం కింద దరఖాస్తు చేయదలచిన వారికి డ్రైవింగ్ లైసెన్సు, జనరిక్ మెడికల్ కోసం దరఖాస్తు చేయదలచిన వారికి డీ ఫార్మసీ లేదా బీ. ఫార్మసీ సర్టిఫికెట్లు ఉండాలని తెలిపారు.

విట్స్ వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డికి డాక్టరేట్



కావలిటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : విట్స్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనాథ్‌రెడ్డికి కర్నూల్‌లోని రాయలసీమ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆప్టిమైజేషన్ బేస్ట్ పవర్ అవేర్ సెక్యూర్ రూటింగ్ ప్రొటోకాల్ ఇన్ మొబైల్ అడ్హాక్ నెట్వర్క్స్ అనే అంశంపై ఎస్కే యూనివర్శిటీ(అనంతపురం) ప్రొఫెసర్ బీ సత్యనారాయణ పర్యవేక్షణలో అధ్యాయనం చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

276 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు 361 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 276 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-74, ఆర్‌ఆర్-1, సీఆర్-8, జంపింగ్ లాట్స్-2 కారణాలతో 85 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.248.41గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరణ్‌దత్ తెలిపారు.

నేడు ప్రత్యేక పీజీఆర్ఎస్

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమంలో అన్నిశాఖలకు సంబంధించి ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకువస్తే తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి మెమోల జారీ



హాజరు రిజిస్టరు పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్వో నారాయణ, జూనియర్ లైన్‌మెన్ బాలసుబ్రహ్మణ్యంలకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీఓ నరేంద్ర దేవ్ తెలిపారు. అయ్యవారిపల్లె సచివాలయంను ఎంపీడీవో మంగళవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో వీఆర్వో నారాయణ, జేఎల్ఎమ్ బాలసుబ్రహ్మణ్యంలు ఈ నెల 1వ తేది నుంచి 13వ తేది వరకు హాజరు రిజిస్టరులో సంతకాలు చేయకపోవడంతో మెమోలు జారీ చేసినట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిషోర్

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మికుల హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సదస్సులో ఆయా కార్మికసంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను, చట్టాలను నీరుగారుస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. లేబర్‌కోడ్‌లను రద్దుచేసి కార్మికుల నడ్డి విరిచేందుకు ప్రయత్నం చేస్తున్నదని, దీనిని పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు అన్నిరంగాలలో పనిచేస్తున్న కార్మికులంతా సంఘీభావం ప్రకటించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిషోర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్, నాయకులు జీ.వెంకటేశ్వర్లు, ఎస్‌ఏ గౌస్, బీ.సురేష్‌బాబు, వై.ఆనంద్‌మోహన్, కె.మురళి, ఎస్‌కే సల్మా, తదితరులు పాల్గొన్నారు.

మీడియా ముసుగులో

పైలాన్‌ను కూల్చడం దుర్మార్గం

- ప్రభుత్వ స్థలంలో ప్రెస్‌క్లబ్ భవనం
- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, టీడీపీ నేతలు

కావలి, మే 13(ఆంధ్రజ్యోతి): మీడియా ముసుగులో కొందరు రాజకీయ నాయకులు అమృత పథకం పైలాన్‌ను కూల్చడం దుర్మార్గమని, ఇది పత్రికారంగానికి కళంకం తేవడానికేనని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం 18 మంది లబ్ధిదారులకు రూ.19,94,427 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత సీఎం చంద్రబాబునాయుడు సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ ఒక అజెండాగా ముందుకు సాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ఈ 10 నెలల్లో రూ.3.79 కోట్ల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశామని చెప్పారు. గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. ఒక ఏడాదిలో ఎంత అభివృద్ధి జరిగిందో త్వరలో వెల్లడిస్తానన్నారు. మీడియా విలువలను దిగజార్చేలా వ్యవహరించిన రాజకీయనాయకులకు బుద్ధి చెప్పే విధంగా త్వరలో కావలిలో అధికారుల ఆమోదంలో ప్రభుత్వ స్థలంలో ప్రెస్‌క్లబ్ భవనం తన సొంత నిధులు వెచ్చించి నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ భవనం కావాలని కొందరు మీడియా మిత్రులు అడిగితే మీడియా ముసుగులో కొందరు రాజకీయనాయకులు తమ రాజకీయ క్రీడలో భాగంగా అమృత్ పథకం పైలాన్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. అలాంటి వారిని పోలీస్ అధికారులు గుర్తించి అరెస్ట్ చేయడం అభినందనీయమన్నారు. టీడీపీ ఎప్పుడూ ప్రెస్‌ను గౌరవిస్తుందన్నారు. జూన్‌లో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఈ ఏడాది చివరకు దానిని పూర్తి చేసి అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబూరావు, పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధు బాబు నాయుడు, మాలేపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలుగోళ్ల శాంభవి ఆలయ అభివృద్ధికి కృషి

కావలి గ్రామ దేవత కలుగోళ్ల శాంభవి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దుగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆలయ ఈవో రాధాకృష్ణ, ప్రధాన అర్చకులు, నేతలతో కలిసి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ప్రాంగణం పరిశీలించి అభివృద్ధిపై చర్చించారు. ఆలయం వద్ద అండర్‌పాస్ రైల్వే వంతెన వస్తే ప్రధాన గేటును ఎటు మార్చాలనేదానిపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న విధంగానే కలుగోళ్ల శాంభవి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తానని చెప్పారు. అనంతరం కావలిపట్టణ అన్నపుగుంటపూడిక తీత పనులను అధికారులు, నేతలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దివ్యాంగుల కుటుంబాల్లో

వెలుగులు నింపిన సీఎం చంద్రబాబు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దివ్యాంగులు

కావలి, మే 13(ఆంధ్రజ్యోతి): పారా క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ ఇచ్చి, పింఛన్ 4వేల నుంచి 6 వేలకు పెంచి దివ్యాంగుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు వెలుగులు నింపారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు, సెక్రటరీ యాదగిరి, స్వచ్ఛందసంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషాలు పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం దివ్యాంగుల హక్కులు, ప్రభుత్వ నిర్ణయాలను తెలియచేసే గోడపత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు రంగబాబు, చరిత్రకుమార్, రామ్‌తేజ్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

- వైభవంగా వసంతోత్సవం



గ్రామోత్సవంలో వేంకటేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

లింగసముద్రం, మే 13(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వసంతోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం జరిగింది. భక్తులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కానుకలు సమర్పించారు. అనంతరం రాత్రి స్వామి వార్లకు ఏకాంతసేవ కార్యక్రమం నిర్వహించారు.

మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం



కందుకూరు : మాచవరంలో నిర్వహించిన కిశోరి వికాసంలో మాట్లాడుతున్న సీడీపీవో శర్మిష్ట, తదితరులు



లింగసముద్రం : మొగిలిచెర్లలో బాలల హక్కుల గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని సీడీపీఓ శర్మిష్ట అన్నారు. మండలంలోని మాచవరంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభావతి, మహిళాపోలీస్ కల్పన, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వరల్డ్‌విజన్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

కిశోరి వికాశంపై అవగాహన

వలేటివారిపాలెం : మండలంలోని కొండసముద్రం, శామీరపాలెం గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత బాలికలకు కిశోరి వికాశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు హిమబిందు, సునీత, శిరోమణి, ఉషారాణి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

లింగసముద్రం : తల్లిదండ్రులు బాలల హక్కుల గురించి తెలుసుకోవాలని లింగసముద్రం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి చెప్పారు. మంగళవారం మండలంలోని మొగిలిచెర్ల అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, 6 నుంచి 14 ఏళ్ల విద్యార్థులకు నిర్బంధ విద్య, బాలికలను లైంగిక వేధింపుల నుంచి కాపాడే పోక్సో చట్టం, బలవంతంగా వెట్టి చాకిరీ తదితర చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మార్తమ్మ, సులోచన, ప్రసన్న, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థ

కలిగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రహదారి వెంబడి ఉన్న గ్రామాల్లో బస్‌షెల్టర్లను కూల్చివేశారు. దీంతో ఆయా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి విస్తరణ కాకముందు ప్రతి గ్రామం వద్ద ఉండిన షెల్టర్లు ప్రయాణికులకు వసతిగా ఉండేవి. రెండేళ్ల క్రితం రహదారి పనులు ప్రారంభమైన తరువాత వీటిని తొలగించడంతోపాటు రహదారి వెంబడి ఉండే పెద్ద పెద్ద చెట్లను కూకటి వేళ్లతో సహా తీసేశారు. దీంతో షెల్టర్లు, చెట్లు నీడ లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు, వానకు అవస్థలు పడుతున్నారు. వేసవి కాలంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండ దెబ్బకు బస్సుల కోసం రోడ్ల మీద ఉండలేకపోతున్నారు. కనీసం చిన్నపాటి బడ్డీకొట్లు ఉన్నా వాటివద్ద నిలబడి బస్సుల కోసం ఎదురుచూసే అవకాశం ఉండేది. అన్ని గ్రామాల వద్ద నిర్మానుష్యంగా మారిపోయాయి. రహదారి పనులు దాదాపు 80 శాతం మేర పూర్తయినా గ్రామాల వద్ద బస్ షెల్టర్ల నిర్మాణాలకు కార్యాచరణ కానరాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సిద్ధనకొండూరు తిప్పపై మంటలు



సిద్ధనకొండూరు తిప్పపై పొగలు

కలిగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరు తిప్పపై ఉన్న అటవీప్రాంతంలో సోమవారం మంటలు వ్యాపించాయి. స్థానికుల అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. తిప్పపై పచ్చని చెట్ల మధ్య ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయ పరిసరాల వద్దకు వచ్చిన భక్తుల తోపాటు స్థానికులు సేద తీరడం పరిపాటి. ఈ క్రమంలో ఎవరో నిప్పు వేయడంతో ఆలయ పరిసరాల్లో చుటూ చిన్నపాటి మంటలు వ్యాపించడంతో గ్రామంలోని యువకులు, స్థానికులు హుటాహుటిన ఆలయ ప్రాంతానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నాలు చేశారు. కావలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తేవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

జూలై 7న ఐసీకేర్ అంతర్జాతీయ సదస్సు

కావలిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జూలై 7వ తేదీ జరగనున్న ఐసీకేర్-2025 అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో జరగనున్న ఈ సదస్సులో కంప్యూటర్ సైన్సు ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఐఓటి రంగాల్లో సరికొత్త పరిశోధనలు కొత్త ఆవిష్కరణలపై ఆయా రంగాల ప్రముఖులు ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ సునీల్‌కుమార్, శ్రీనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి పునఃప్రతిష్ఠ మహోత్సవం



కలశాలతో మహిళల ప్రదర్శన

కావలిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి) : పరివార సమేత వాసవీ కన్యకాపరమేశ్వరి పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. బుధవారం నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఈ మహోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం పుల్లారెడ్డినగర్ ట్రంకురోడ్డు వద్దనున్న సత్యనారాయణస్వామి ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు మహిళలు కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ట్రంకురోడ్డును నీళ్లతో శుద్ధి చేసి అడుగడునా ముగ్గులు దిద్ది ఊరేగింపుకు స్వాగతం పలికారు. ఊరేగింపు ముందు భాగాన చిన్నారులు, మహిళల కోలాటాలు, భజనల్లతో, వేషాధారణలు, పెద్దఎత్తున బాణా సంచా కాల్చుకుంటూ బ్యాండ్ మేళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు అట్టహాసంగా సాగింది. రోడ్డుకిరువైపులా బారులు తీరిన భక్తజనం అడుగడునా ఊరేగింపుకు బ్రహ్మరథం పట్టారు. జై వాసవీ మాత నామస్మరణతో ట్రంకురోడ్డు మార్మోగడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కందుకూరి సత్యనారాయణ, గ్రంధి రమేష్, వోలేటి నాగేశ్వరరావు, కనమర్లపూడి నారాయణ, అమరా వేదగిరి, పీ అలేఖ్య, శ్రీకాంత్, సీవీసీ సత్యం, తదితరులు పాల్గొన్నారు.



ఊరంతా జాతర



మంగళవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో గంగమ్మ విశ్వరూప ప్రతిమ తయారీ

- భక్తజనంతో పోటెత్తిన గంగమ్మ ఆలయం
- వేకువజామున చెంపనరుకుడుతో ముగియనున్న సంబరం



అడుగడుగునా దండాలు. వీధి, వీధిన అంబళ్లు. నడివీధుల్లో సందళ్లు. వెరసి ఊరంతా జాతర సంబరం చేసుకుంది. అమ్మలుగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లింది. కోర్కెలు తీర్చే కొంగు బంగారాన్ని కళ్లకద్దుకుని తన్మయత్వమైంది. భక్తి పారవశ్యంతో చిందేసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి గంగజాతరకు చాటింపు అనంతరం వివిధ వేషాలలో మునిగితేలిన తాతయ్యగుంట గంగమ్మను మంగళవారం ఉదయాత్పూర్వం విశిష్ట అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహాభిషేకంలో అర్చకులు మినహా ఎవరినీ అనుమతించలేదు. సర్వాలంకారశోభితమైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు. సోమవారం అర్ధ రాత్రి నుంచే కొందరు భక్తులు దండాలు, పొర్లు దండాలు పెట్టుకుంటూ, వేషాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఇలా.. అభిషేకానంతర దర్శనం మొదలుకొని నిర్విరామంగా గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పురుషులు పలురకాల విచిత్ర వేషధారణలతో పాటు, మహిళలు కొందరు వేపాకు చీరలు కట్టుకుని అమ్మవారి ఆలయ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గర్భాలయంలోకి ఇతరులు వెళ్లకుండా కమిషనర్ మౌర్య కట్టడి చేయడంతో భక్తులకు అసౌకర్యం లేకుండా క్యూలైన్లు ముందుకు కదలాయి. ఇక, ఒక్క తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోనే కాకుండా.. టీపీ ఏరియాలో తాళ్లపాక పెదగంగమ్మ, చింతలచేనులో ముత్యాలమ్మ, దాసరిమఠంలో మాతమ్మ, పల్లెవీధిలో వేశాలమ్మ, చింతకాయవీధిలో కరిమాను గంగమ్మతో పాటు నగరంలోని చిన్నచిన్న గంగమ్మ ఆలయాల్లోనూ జాతర సంబరాలు జరిగాయి. దీంతో నగరమంతా జాతర సందడి నెలకొంది. మంగళవారం భక్తులు పలు పౌరాణిక, జానపద వేషాలు ధరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. వైసీపీ మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఆర్కే రోజాలు అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా సీపీఐ నేత నారాయణ కూడా ఆలయానికి వచ్చారు. కాగా, వారం రోజుల గంగజాతరలో మంగళవారం ఒక్క రోజు మాత్రమే అమ్మవారికి అలంకరించే బంగారు ముఖ కవచం, వజ్రకిరీటధారిణిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు.

పారిశుధ్యం భేష్

తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వేలాది మంది భక్తులు సమర్పించే పొంగళ్ల నైవేద్యాలు, జంతుబలుల వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో నగర పాలకసంస్థ పారిశుధ్య కార్మికులు శ్రమించారు. మూడు షిఫ్టుల్లో 150 మందికి పైగా కార్మికులు నిర్విరామంగా శ్రమించి భక్తులచేత శభాష్ అనిపించుకున్నారు.



|| నేడు విశ్వరూప దర్శనం ||

అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం భక్తులు వేచి చూస్తున్నారు. పేరంటాల వేషధారులు పంబల వాయిద్యాలతో చాటు మండపం వద్దకు వెళ్లిన తరువాత బేరిశెట్టి ఇంటికి వెళ్లి అక్కడనుండి మరికొన్ని చోట్లకు వెళ్లి పేరంటాలు పూజలు అందుకుంటారు. అక్కడ నుండి బుధవారం వేకువజామున చిన గంగమ్మ చెంప నరికి ఆతరువాత పెద గంగమ్మ చెంప నరకడంతో జాతర సంబరం ముగుస్తుంది.

|| అమ్మకు పొంగళ్లు.. భక్తులకు అంబళ్లు ||

మంగళవారం వేకువజామునుంచే మహిళా భక్తులు ఆలయ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కూరగాయల మార్కెట్లో పొంగళ్లు పొంగించి అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి నైవేద్యం సమర్పించారు. ఇంటినుంచి తెచ్చుకున్న అంబళ్లను భక్తులను అందజేశారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

- సమూల మార్పులకు శ్రీకారం
- తొమ్మిది రకాలుగా స్కూళ్ల విభజన
- 162 పాఠశాలల ఉన్నతీకరణ
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ల కేటాయింపు
- పలు టీచర్ల పోస్టుల్లో సైతం మార్పులు

చిత్తూరు సెంట్రల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా పాఠశాలలకు సంబంధించి విద్యాశాఖ సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది.ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం, సబ్జెక్టు ఉపాధ్యాయులకు పనిభారాన్ని తగ్గిచడం, విద్యార్థుల అభ్యాస ఫలితాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టనున్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 162 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 4,719వున్నాయి.17,372 టీచర్ల పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 15,454 మంది టీచర్లు పనిచేస్తున్నారు.1918 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 723మంది ఉపాధ్యాయులుండగా, ఎంపీపీ/జడ్పీ పాఠశాలల్లో 15,552 మంది, మున్సిపల్ పాఠశాలల్లో 589మంది, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 508 మంది టీచర్లు పనిచేస్తున్నారు. గత నాలుగు నెలల కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 4719 పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది.కలెక్టర్ అధ్యక్షతన జరుగుతున్న ఈ ప్రక్రియలో విద్యాశాఖ అధికారులు డీఈవో, డీవైఈవో, ఎంఈవోలు కీలక పాత్ర పోషిస్తున్నారు. అంగన్‌వాడీల నుంచి ఇంటర్మీడియట్ విద్య వరకు ప్రభుత్వజడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజిస్తున్నారు.

పాఠశాలల్లో సిబ్బంది

ప్రీ ప్రైమరీ పాఠశాల(ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, 1-5 తరగతులు)ల్లో 1నుంచి 30మంది విద్యార్థులుంటే ఒక సెకండరీ గ్రేడ్ టీచర్, 31నుంచి 60 మంది దాకా ఉంటే ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లను కేటాయిస్తారు.● మోడల్ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో 1నుంచి 59 మంది విద్యార్థులుంటే మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం/స్కూల్ అసిస్టెంట్, ముగ్గురు ఎస్జీటీలను కేటాయిస్తారు. 60నుంచి 150మంది దాకా విద్యార్థులుంటే ఒక మోడల్ స్కూల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం/స్కూల్ అసిస్టెంట్, నలుగురు ఎస్జీటీలను కేటాయిస్తారు. 150కి పైగా విద్యార్థులుంటే ప్రతి 30 మంది విద్యార్థులకు అదనంగా ఒక ఎస్జీటీని కేటాయిస్తారు.●ఉన్నత పాఠశాల (6-8 తరగతులు)- 1నుంచి 10మంది విద్యార్థులకు ఒక స్కూల్ అసిస్టెంట్, 11నుంచి 30 మంది విద్యార్థులకు ఇద్దరు ఎస్ఏలు, 31నుంచి 140 వరకు నలుగురు ఎస్ఏలు,141 నుంచి 175 వరకు విద్యార్థులుంటే ఐదుగురు ఎస్ఏలను కేటాయిస్తారు. ● 75మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ఎస్ఏ హెచ్ఎంగా వ్యవహరిస్తారు.● క్లస్టర్ ఉన్నత పాఠశాలల్లో ఒక హెచ్ఎం, ఒక ఎస్(పీఈ)/పీఈటీ పోస్టు కేటాయిస్తారు. 76కంటే ఎక్కువమంది విద్యార్థులుంటే హెచ్ఎం, ఎస్ఏ(పీఈ)/పీఈటీ పోస్టులు కేటాయిస్తారు.● 400 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉంటే రెండు ఎస్ఏ, 751 మంది నమోదైతే 3వ ఎస్ఏ పోస్టు కేటాయిస్తారు. ఇలా 350మంది విద్యార్థులకు ఒక ఎస్ఏ పోస్టు కేటాయిస్తారు.

టీచర్ల కేడర్లలోనూ మార్పులు

స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా మార్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపీపీ/జడ్పీ యాజమాన్యాల్లో 612మంది, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆరుగురు ఉన్నారు. ● క్లస్టర్ స్థాయిలో వర్కింగ్ సర్ప్లస్ స్కూల్ అసిస్టెంట్/సెకండరీ గ్రేడ్ టీచర్, తత్సమాన పోస్టులను క్లస్టర్ లెవల్ అకడమిక్ టీచర్లుగా ఉపయోగించుకోనున్నారు. ఎంపీపీ/జడ్పీ యాజమాన్యాల్లో స్కూల్ అసిస్టెంట్లు 134మంది ఉండగా, ప్రభుత్వ యాజమాన్యంలో 6, మున్సిపల్ కార్పొరేషన్‌లో 8 మంది ఉన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలోని డీఈవో పూల్లో 217 మంది టీచర్లున్నారు. 65మంది హెచ్ఎంలు, 195మంది స్కూల్ అసిస్టెంట్లు, 11మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. వీరిని సైతం సర్దుబాటు చేయనున్నారు.

1.శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ (అంగన్‌వాడీలు)	- 58
2.ఫౌండేషన్ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, ఒకటి, రెండు తరగతులు)	- 991
3.బేసిక్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ 1-5 తరగతులు)	-2018
4.మోడల్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ 1-5 తరగతులు)	-928
5.అప్పర్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, 1-8 తరగతులు)	-70
6. హైస్కూళ్లు (6-10 తరగతులు)	- 526
7. హైస్కూళ్లు (1-10 తరగతులు)	- 71
8.హైస్కూల్ ప్లస్ (6-12 తరగతులు) + బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 9.హైస్కూల్ ప్లస్ (1-12 తరగతులు) + మోడల్ ప్రైమరీ స్కూళ్లు	- 57
మొత్తం	4719





స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

ముగిసిన అమ్మవారి వసంతోత్సవాలు

తిరుచానూరు, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఉదయం మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. మధ్యాహ్నం ఉత్సవర్లను ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి బంగారు పీఠంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి అమ్మవారికి వీధోత్సవం జరిగింది. మూడు రోజులపాటు జరిగిన వేడుకలు మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టీటీడీ ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులు, ఏఈవో దేవరాజులు, అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సహకార సొసైటీ అక్రమాలపై నేటి నుంచి విచారణ

తిరుపతి(నేరవిభాగం), మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు సహకార సొసైటీలో జరిగిన రూ.80 లక్షల అక్రమాలపై బుధవారం నుంచి అధికారులు విచారణ చేపట్టనున్నారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో క్రైం డీఎస్పీ శ్యామ్‌సుందర్, నాయుడుపేట డీఎస్పీ శేషుబాబు విచారణాధికారులుగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ అక్రమాలకు సూత్రధారులు ఎవరనే కోణంలో వీరు దర్యాప్తు చేసి ఎస్పీకి నివేదిక సమర్పించనున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. దాదాపు ఐదుగురు పోలీసు సిబ్బంది హస్తం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పక్కకు తప్పించారు. కాగా, దుర్వినియోగమైన రూ.80 లక్షల్లో.. రుణాలు తీసుకున్న సొసైటీ సభ్యుల్లో ఎవరు చెల్లించిన డబ్బులు ఉన్నాయి? వీరు ఎప్పుడు చెల్లించారనే వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. ఈ ఘటనలో ఆధారాలు దొరక్కుండా డేటాను మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. మరో వైపు తమకు న్యాయం చేయాలని బాధిత పోలీసులు కోరుతున్నారు.

పిడుగుపాటు మృతులకు పరిహారం మంజూరు

తిరుపతి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో అకాల వర్షాల సందర్భంగా పిడుగుపాటుతో మరణించిన నలుగురి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈనెల 2న ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లి పంచాయతీ వడ్డిపల్లికి చెందిన కోటకొండ రమణ (59).. 4న నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగకు చెందిన అల్లం భాస్కర్ (54), నాయుడుపేటకు చెందిన మారిబోయిన కార్తీక్ (10), వాకాడు మండలం బాలిరెడ్డిపాలేనికి చెందిన రెడ్డి మునెయ్య (44) పిడుగుపాటుకు బలైన సంగతి తెలిసిందే. ఈ రెండు తేదీలలో పిడుగు పాటుకు మృతి చెందిన నలుగురికి సంబంధించి.. ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షలు వంతున ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు మృతుల కుటుంబాలకు రూ.16 లక్షలు చెల్లించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.



మొదటి ఘాట్‌లో అవ్వాచారి కోన వద్ద ఏర్పాటు చేసిన సోలార్ సీసీ కెమెరా

తిరుమల ఘాట్‌లోనూ సోలార్ సీసీ కెమెరాలు

తిరుమల, మే13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా ఘాట్ రోడ్లు సహా పలు ప్రాంతాల్లో సోలార్ సీసీ కెమెరాలను అమర్చారు. ప్రస్తుతం తిరుమల శ్రీవారి ఆలయం, వైకుంఠం క్యూకాంప్లెక్సులు, క్యూలైన్లు, అన్నప్రసాద భవనం, లడ్డూ కౌంటర్, కల్యాణకట్టలు, గదుల కేటాయింపు కేంద్రాలు, యాత్రికుల వసతి సముదాయాలు, అలిపిరి, జీఎన్సీ టోల్‌గేట్ వంటి ప్రాంతాలతో పాటు లేపాక్షి, రాంభగీచ, వరాహస్వామి వంటి ప్రాంతాల్లో దాదాపు 2,780 సీసీ కెమెరాలు ఉన్నాయి. పీఏసీ-4లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని వీడియో వాల్ ద్వారా వీటిని పరిశీలిస్తుంటారు. విశేష పర్వదినాల్లో అదనంగా కొన్ని ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సీసీ కెమెరాలను తిరుమల సరిహద్దుల దాకా విస్తరించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా తిరుమల ఘాట్ రోడ్లు, పార్వేటమండపం, శ్రీవారిమెట్టు వంటి సరిహద్దు ప్రాంతాల్లోనూ సోలార్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. తొలివిడతలో 15 సోలార్ కెమెరాలను అమర్చారు. విద్యుత్‌తో అవసరం లేకుండా కేవలం సౌరశక్తితో ఇవి పనిచేయనున్నాయి. వీడియోతో పాటు ఆడియో టెక్నాలజీతో పనిచేసే ఈ సీసీ కెమెరాల ఫుటేజ్‌ను వైర్‌లెస్ కనెక్టివిటీతో ఎక్కడి నుంచైనా స్మార్ట్‌ఫోన్ ద్వారా వీక్షించవచ్చు. వీటి పనితీరు మంచి ఫలితాలు ఇస్తే తిరుమల చుట్టూ మరిన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లోని 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,760

తలనీలాలు సమర్పించినవారు: 29,361





గంగమ్మకు నీరాజనం

తిరుపతి గంగ జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి మంగళవారం వేకువజామునుంచే వచ్చారు. పొంగళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. మిగతా గంగమ్మలనూ దర్శించుకున్నారు. ఇలా తరలివచ్చిన భక్తజనంతో గంగమ్మ ఆలయాలు కిటకిటలాడాయి.

పీఎండీఎస్ సాగు పెంచాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎండీఎస్ (తొలకరికి ముందే విత్తడం) సాగును పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎండీఎస్ సాగుపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్షించారు. పీఎండీఎస్ విత్తనాల కిట్‌ను పరిశీలించి సాగు విధానం గురించి తెలుసుకున్నారు. పీఎండీఎస్ విత్తనాల కిట్‌కు 30 రకాల పంట విత్తనాలు కలిపి తయారు చేస్తారన్నారు. ఎకరాకు 10-15 కిలోల విత్తనాలు విత్తుకోవాలన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు 50వేల కిట్లు లక్ష్యంగా చేసుకుని రైతులకు సరఫరా చేయాలన్నారు. వరి నాట్లకు ముందు, మామిడి కోతల తరువాత ప్రతి రైతు తప్పనిసరిగా పీఎండీఎస్ విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పథక మేనేజరు షణ్ముగం పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీస్తారా?

- 'డీడీ నెక్ట్స్ లెవల్' తమిళ సినిమాపై తిరుమల పోలీసులకు ఫిర్యాదు



తిరుమలలో తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామికి వినతి పత్రం ఇస్తున్న కిరణ్ రాయల్

తిరుమల, మే13(ఆంధ్ర జ్యోతి): 'డీడీ నెక్ట్స్ లెవల్' అనే తమిళ సినిమాలో 'శ్రీనివాస గోవింద' అనే పాట హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందంటూ జనసేన నేత కిరణ్‌రాయల్ తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ పాట వీడియోను కూడా ఫిర్యాదుతో పాటూ ఎస్‌ఐ రమేష్‌కు అందజేశారు. అనంతరం కిరణ్ రాయల్ మీడియాతో మాట్లాడుతూ, 'శ్రీనివాస గోవిందా' అనే పాటను రీమిక్స్ చేసి సినిమాలో క్లబ్ డ్యాన్స్‌గా మార్చారన్నారు. దీనిపై తమిళనాడులోని హిందువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ సెన్సార్ బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. తమకు ప్రభుత్వ సహకారం కూడా ఉందని సినిమా బృందం సభ్యులు చెప్తున్నారన్నారు. తమిళనాడు ప్రభుత్వం నాస్తికుల ప్రభుత్వమన్నారు. దీన్ని హిందూ సమాజంపై కుట్రగానే భావిస్తున్నామన్నారు. ఆ సినిమాను బ్యాన్ చేయకుండా తమిళనాడు నుంచి నాయకులు తిరుమలకు వచ్చి పూజలు చేస్తామంటే ఒప్పుకోమన్నారు. కాగా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన తమిళనాడు రాష్ట్ర ప్రతిపక్ష నేత, మాజీ సీఎం పళనిస్వామిని మంగళవారం కిరణ్‌రాయల్ కలిసి, భక్తుల మనోభావాలు కాపాడేందుకు సహకరించాలని కోరారు.

త్వరలో రుయాలో సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్

తిరుపతి(కలెక్టరేట్), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో త్వరలో సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభిస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్‌పై వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. డయాగ్నొస్టిక్ సెంటర్ అందుబాటులోకి వస్తే 136 రక్త, మూత్ర ఇతర ముఖ్యమైన పరీక్షలు చేసే అవకాశం ఉంటుందన్నారు. తిరుపతి నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నుంచి వచ్చే రోగులకు ఈ కేంద్రంలో పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్

వాడివేడిగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

- కోరం లేకుండానే రెండో కమిటీ సమావేశ నిర్వహణ
- పీఆర్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులను నిలదీసిన సభ్యులు





సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో రవికుమార్ నాయుడు - హాజరైన సభ్యులు, అధికారులు

చిత్తూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి):చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాడివేడిగా సాగాయి.మొత్తం 7 కమిటీల సమావేశాల్లో రెండో కమిటీ సమావేశాన్ని కోరం లేకుండానే పూర్తిచేశారు.6వ కమిటీ సమావేశానికి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, 5వ కమిటీకి స్త్రీ, శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, తవణంపల్లె జడ్పీటీసీ భారతి, 3వ కమిటీకి వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి అధ్యక్షత వహించాల్సి ఉండగా వారు గైర్హాజరయ్యారు. అన్ని సమావేశాలకూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసులే అధ్యక్షత వహించారు.1వ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులే మిగిలిన కమిటీ సమావేశాల్లో పాల్గొనడం చర్చనీయాంశమైంది.సమస్యలపై చర్చలు తప్ప పరిష్కరించడం లేదని పలు శాఖల అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు మూడు సమావేశాల్లో చర్చించిన సమస్యలను ఇంతవరకూ పరిష్కరించలేదని ఆరోపించారు.

బీసీ హాస్టళ్లలో ఈబీసీలకూ అవకాశం కల్పించండి:జడ్పీ చైర్మన్ సూచన

బీసీ హాస్టళ్లలో మిగిలిన సీట్లను వృధా కాకుండా ఈబీసీలకు అవకాశం కల్పించమని బీసీ సంక్షేమ అధికారులకు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. వి.కోట బీసీ బాలికల హాస్టల్‌లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వేరుశనగ విత్తనాల పంపిణీ ఆలస్యమవుతోందనగా గతేడాది 43 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయగా.. ఈ ఏడాది అందులో సగం మాత్రమే జిల్లాకు కేటాయించారని, ఈ నెలలో పంపిణీ ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దీనిపై జడ్పీ చైర్మన్ ఉన్నతాధికారులతో మాట్లాడి గతం కన్నా ఈ ఏడాది అధికంగా పంపిణీ చేయాలని సూచించారు. ●రామసముద్రం మండలంలో అసంపూర్ణంగా వున్న గ్రామ సచివాలయాల భవనాలను పూర్తి చేయాలని జడ్పీటీసీ రామచంద్రారెడ్డి కోరారు.ఆర్.నడింపల్లె కొండపై 9 నెలల కిందట వాలీశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లేందుకు రూ.2 కోట్లతో రోడ్డు పనులు మొదలుపెట్టి చదును చేసి వదిలిపెట్టారని, వర్షం పడినప్పుడల్లా రోడ్డులోని మట్టి కొట్టుకుపోతోందన్నారు.జడ్పీ గ్రాంట్ కింద సుమారు రూ.45 లక్షలు వాటర్ వర్క్స్ కోసం మంజూరవగా.. రూ.1.20 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ●నారాయణవనం మండలంలోని ఎరుకంబట్టు, గోవిందప్పనాయుడు కండ్రిగ, సుబ్బానాయుడు కండ్రిగ, తుంబూరు, పాలమంగళం పంచాయతీల్లో రోడ్లపై కంకరవేసి వదిలిపెట్టారని, దీంతో రాత్రివేళల్లో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని జడ్పీటీసీ సుమన్‌కుమార్ చెప్పారు.తారు రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ●వడమాలపేట జడ్పీటీసీ మురళి మాట్లాడుతూ 2015లో రూ.11 లక్షలతో అభివృద్ధి పనులు చేశానని, టెండర్ పిలిచినప్పుడు వ్యాట్, జీఎస్టీ లేదని చెప్పి తీరా బిల్లులు మంజూరు అయ్యాక జీఎస్టీ కట్టమని ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ●పాలసముద్రం జడ్పీటీసీ అన్బలగన్ మాట్లాడుతూ బాలకృష్ణాపురం రోడ్డుపై 2018లో కంకరవేసి వదిలిపెట్టడంతో 5 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ● పెద్దతిప్పసముద్రం జడ్పీటీసీ శివన్న మాట్లాడుతూ కందుకూరులో తాగునీటి కోసం బోరు వేసి మోటర్ బిగించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ●చౌడేపల్లె జడ్పీటీసీ దామోదరరాజు మాట్లాడు తూ వ్యవసాయ సర్వీసులకు డబ్బులు చెల్లించి రెండేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నారని,ఏఈని అడిగితే మెటీరియల్ లేదని సమాధానం చెబుతున్నారని వాపోయారు ● పెనుమూరు జడ్పీటీసీ దొరస్వామి మాట్లాడుతూ కొటార్లపల్లె ఏపీడబ్ల్యూ జగనన్న కాలనీలో 25మంది ఇళ్లు నిర్మించుకున్నా విద్యుత్ సర్వీసు ఇవ్వలేదని చెప్పగా సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. ●ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య మాట్లాడుతూ మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యుత్ శాఖ ఎస్ఈ దృష్టికి తీసుకొచ్చారు.సమావేశానికి వైద్య శాఖ అధికారుల గైర్హాజరుపై సభ్యులతో పాటు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి సమావేశానికి చిన్న స్థాయి అధికారులను పంపడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డిప్యూటీ సీఈవో జుబేదా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఆలయం వద్ద ఏఈవో దేవరాజులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్న వీరు.. అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రంతో వేదపండితులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

- రెండు కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు.. శ్రీకాళహస్తి దర్గామిట్టకు చెందిన షేక్ మహబూబ్‌బాషా, కేవీబీపురం మండలం రాగిగుంటకు చెందిన కంచి చైతన్య, తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన ఆదెం వెంకటసాయిప్రతాప్‌రెడ్డి, తిరుపతి రూరల్ తిమ్మినాయుడుపాళెంకు చెందిన మంగళం జోసఫ్ కొంతకాలంగా తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండు, ఇతర రద్దీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయించేవారు. వీరు శ్రీకాకుళం జిల్లాకు చెందిన కింగ్‌పిన్ నుంచి రైళ్ల ద్వారా గంజాయి తెప్పించి చిన్న, చిన్న పొట్లాలు కడతారు. ఒక్కో పొట్లాన్ని రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయించేవారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐలు నాగార్జునరెడ్డి, సిబ్బంది కలసి లీలామహల్- మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయం వద్ద కాపుకాచి నిందితులను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మ స్ఫూర్తితో తిరుగుబాటు చేయాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



తిరుపతి(ఆటోనగర్), మే 13 (ఆంధ్రజ్యోతి): 'నాడు పాలెగాళ్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటమే నేటి గంగ జాతర. గంగమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజలు పాలకులపై తిరుగుబాటు చేయాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మను మంగళవారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'వేల మంది జాతరకు హాజరైన సమయంలో వివిధ వేషాల్లో ఉన్నవారు ఎన్ని బూతులు తిట్టినా ప్రజలు పట్టించుకోరు. అదే ఈ జాతర ప్రత్యేకత' అని పేర్కొన్నారు. 40 ఏళ్ల క్రితం ఒక వ్యక్తి ఆడవేషం వేసుకుని తనను బండిపై ఎక్కించుకొని వెళ్లారంటూ నారాయణ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.మోహన్ కుమార్ రాజు, ఎ.రామానాయుడు, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

అంతా.. ప్రశాంతంగా..!

- పోలీసుల చొరవ భేష్



వీఐపీ దారిలో భక్తులను నియంత్రిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రద్దీని నియంత్రించడంతో ఎక్కడా తొక్కిసలాటలు జరగలేదు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి భక్తుల రద్దీ బాగా పెరిగింది. వేలాది మంది ఒక్కసారిగా రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. వీఐపీ లైను వద్ద మాత్రం చాలా రద్దీ కనపడడంతో డీఎస్పీ భక్తవత్సలం దగ్గరుండి భక్తులను అనుమతించారు. ఒక దశలో భక్తుల రద్దీని నియంత్రించడం పోలీసుల చేయిదాటే పరిస్థితి రావడంతో వెంటనే రోప్ పార్టీని పిలిపించారు. రాత్రి 7 గంటల నుంచి 9.45 గంటల వరకు మహిళలు, యువకులు, వేషాలు ధరించి వస్తున్న భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో వారిని కంట్రోలు చేయడానికి ఇబ్బంది పడ్డారు. ఇక, అన్ని కోణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఎక్కడ ఎలాంటి పరిస్థితి ఎదురైనా కమాండ్ కంట్రోలు యూనిట్ ద్వారా పరిశీలించి చర్యలు చేపట్టారు. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించడంతో దొంగలు, చైన్ స్నాచర్లకు కొంత భయం ఏర్పడింది. బిట్రగుంట గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకోవడంతో చైన్ స్నాచింగ్‌లు కొంత తగ్గుముఖం పట్టాయి. ఇక, జనంలో మిస్ అయిన వారికోసం బాధితులు పోలీసు కంట్రోలు రూముకు సమాచారం ఇస్తుండడంతో వెంటనే వారిని అప్పగించేలా చర్యలు చేపట్టారు. ఇలా రెండు రోజుల వ్యవధిలో దాదాపు 53 మందిని అప్పగించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మహిళలకు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. మూడు నెలల పాటు రోజుకు రెండు విడతలుగా 140మంది మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా, ఎంపీడీవో కోటేశ్వరావు, సీఐ రమణ, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్లు పద్మ, సుమతి, నాయకులు దొంతు బాలకృష్ణ, పునుగోటి విశ్వనాథ నాయుడు, మురళి, జీకేపల్లి బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతానోత్పత్తి పెంపునకే జననియాత్ర



సంతాన సాఫల్యతపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మునిగిరీష్

గూడూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సంతానోత్పత్తి పెంపొందించేందుకు వయాసిస్ ఫెర్టిలిటీ జననియాత్ర చేపట్టి అవగాహన కల్పించడం అభినందనీయమని రోటరీక్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ మునిగిరీష్ అన్నారు. మంగళవారం వయాసిస్ ఫెర్టిలిటీ జననియాత్ర బస్సు స్థానిక ఏఆర్ ప్రభుత్వ స్టేడియానికి చేరుకోవడంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి అవగాహన కల్పించారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లవి మాట్లాడుతూ మదర్స్ డే సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో జనని యాత్రను చేపట్టి సంతానోత్పత్తిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సరైన వయస్సులో వివాహం చేసుకోకపోవడం, ఉద్యోగ రీత్యా ఆలస్యంగా పిల్లలను కనడమే సంతానోత్పత్తి తగ్గడానికి ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో రాజేష్, శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, మే 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్ఐ శివశంకర్ సూచించారు. మంగళవారం డక్కిలి మండలం కంథలవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధించడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే పరిమితికి మించి జనాన్ని తరలిస్తున్న ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు పాటించకపోతే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తడ, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడులో దీవిలో వెలసిన శృంగీశ్వర శ్రీరంగపెరుమాళ్ ఆలయంలో జరుగుతున్న మహాలక్ష్మార్చనలో భాగంగా మంగళవారం స్వామి వారికి పూలంగి సేవ నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ ఎదుట హోమగుండం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అశోక్ మొదలి, భాస్కర్ మొదలి, నందగోపాల్, దండపాణి, మణి, కృపాకర్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

పెళ్లకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గంగాబత్తిన రామకృష్ణ తదితరులు ఉన్నారు,

ఇలకూరుపాడులో రీసర్వే



రీ సర్వేకు సంబంధించి భూముల వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దారు జయజయరావు, సర్వేయర్లు

కోట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దవరం పంచాయతీ ఇలకూరుపాడులో మంగళవారం భూముల రీ సర్వే జరిగింది. పంచాయతీ పరిధిలోని భూములను రెండు సర్వే బృందాలు సర్వే చేస్తున్నాయి. తహసీల్దార్ జయజయరావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి సర్వే బృందాలు, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు. గుమ్మడి సుధాకర్‌రావు, ప్రమీలమ్మ, శశిధర్, పూజిత ఉభయదాతలుగా వ్యవహరించారు.

రెండు బైక్‌ల ఢీ: ఇద్దరికి గాయాలు

వెంకటగిరి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద రెండు మోటారు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరి గాయాలయ్యాయి. రాపూరు మండలం చెల్లటూరు గ్రామానికి చెందిన శ్రీరామదాసు సూర్యనారాయణ, లక్ష్మి తిరుపతి నుంచి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి మరో బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరామదాసు సూర్యనారాయణ, లక్ష్మి దంపతులు గాయపడ్డారు. వీరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఐఎస్ఐ రమణయ్య తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

చిట్టమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గున్నాగుంట మలుపు వద్ద మంగళవారం తెల్లవారుజామున ఓ కారు కాలువలోకి దూసుకెళ్లింది. మల్లాం నుంచి నాయుడుపేటకు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కాలువలోకి దూసుకెళ్లిందని, ఈ ఘటనలో ఇద్దరు గాయపడినట్లు తెలిసింది. దీనిపై పోలీసులకు సమాచారం అందలేదని ఎస్ఐ చిన్న బలరామయ్య చెప్పారు.

నేడు చిట్టమూరు మండల సమావేశం

చిట్టమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరుగుతుందని ఎంపీడీవో మన్‌హర్ గౌడ్ తెలిపారు. స్త్రీ సంక్షేమ భవనంలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో మండలంలో తాగునీటి సమస్యపై చర్చించడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో చెప్పారు.





వైఎస్ఆర్ పార్కులో శిథిలావస్థలో ఉన్న క్రీడా పరికరాలు - దుస్థితిలో అన్నంగి బాబురావు పార్కు

పట్టణవాసులకు ఆహ్లాదం కరువు

రూపుకోల్పోయి, దుస్థితికి చేరిన పార్కులు

గూడూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణవాసులకు ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్కులు రూపుకోల్పోయాయి. వసతుల లేమితో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయి, కొన్నింటికి ప్రహరీలు కూలిపోయి, మరికొన్నింటిలో ఎప్పుడో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పచ్చని చెట్లు, చల్లని గాలులతో ఆహ్లాదాన్ని, మనస్సుకు ప్రశాంతతను పంచాల్సిన పార్కులు నేడు దీనస్థితిలో ఉన్నాయి. పట్టణ ప్రజలు సేదతీరేందుకు మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో గతంలో పలుచోట్ల పార్కులను ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు, వృద్ధులు సేద తీరేందుకు, ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా పార్కులను ఏర్పాటు చేశారు. పట్టణంలో ఐసీఎస్ రోడ్డులో వైఎస్ఆర్ పార్కు, రైతుబజారు సమీపంలో సీవీసీ పార్కు, అరుంధతీయపాళెం సమీపంలో వీఎస్ఆర్ పార్కు, వరదానగర్‌లో ఎన్టీఆర్ పార్కు, నెహ్రూనగర్‌లో సర్వేపల్లి రామారావు పార్కు, మాళవ్యానగర్‌లో అన్నంగి బాబురావు పార్కు, జానకీరామ్‌పేటలో రామ్‌నగర్ పార్కులను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇందులో సర్వేపల్లి రామారావు పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు దాతలు క్రీడా వస్తువులను ఏర్పాటు చేయడంతో ఆడుకునేందుకు వీలుగా ఉంది. సీవీసీ పార్కులో నీడనిచ్చే చెట్లు ఉండడంతో ఎక్కువ మంది ప్రజలు సేద తీరుతుంటారు. మిగిలిన పార్కులు దుస్థితికి చేరుకున్నాయి. కొన్ని పార్కులు పిచ్చిమొక్కలతో నిండిపోయి నిరుపయోగంగా ఉంటే, మరికొన్ని ప్రహరీ కూలిపోయి దుస్థితిలో ఉన్నాయి. వేసవిలో సెలవులు కావడంతో చిన్నారులు ఆడుకోవడానికి తగిన స్థలం లేదని, పార్కుల్లో వసతులు లేకపోవడంతో స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియానికి పిల్లలను తీసుకెళ్లాల్సి వస్తోందని పట్టణవాసులు అంటున్నారు. దుస్థితిలో ఉన్న పార్కులను అభివృద్ధి పరచడంతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా పట్టణంలో విశాల ప్రదేశంలో పెద్ద పార్కును ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.





పొగగొట్టం కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా - ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వెన్నెలను అడ్డుకుంటున్న సీఐ బాబీ, ఎస్ఐ ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది

అక్రమ కట్టడం కూల్చివేత

పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న పోలీసులు

నాయుడుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పొగగొట్టం కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. పొగగొట్టంకాలనీ ప్రాంతంలోని దాదాపు 18.57 ఎకరాలను 11 మంది రైతులు కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడ శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. సదరు భూములు తమకు చెందినవంటూ వెంకటగిరి రాజా వీఎస్‌జీ యాచేంద్ర హైకోర్టును ఆశ్రయించారు. రైతులు కూడా కౌంటర్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో పొగగొట్టంకాలనీ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు స్టే మంజూరు చేసింది. ఇటీవల కావేరిపాకం లోకేష్ భవన నిర్మాణం చేపట్టడంతో మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ నిర్మాణం కొనసాగిస్తుండడంతో మంగళవారం కమిషనర్, పోలీసు, రెవెన్యూ అధికారులు పొగగొట్టంకాలనీకి చేరుకుని భవనాన్ని కూల్చివేశారు. ఈ క్రమంలో లోకేష్ బంధువు కావేరిపాకం వెన్నెల అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నం చేయడంతో సీఐ బాబీ, ఎస్ఐ ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు 48మంది ఎంపిక



రెజ్లింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నాయుడుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి రెజ్లింగ్ అండర్-17 మెన్ అండ్ ఉమెన్ పోటీలు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రోసనూరులో నిర్వహించారు. ఇందులో 48క్రీడాకారులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను నాయుడుపేట ట్రినేటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ ఆదవరపు నాగూరయ్య, రెజ్లింగ్ అసోసియేషన్ కోశాధికారి ఎ.అబిలాష్, కోచ్‌లు ఇందుజా, లోకేష్, ప్రసాద్ తదితరులు అభినందించారు.





లక్ష్మీనరసింహస్వామి వసంతోత్సవం - చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

చిల్లకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కలవకొండ లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళవారం స్వామివారికి వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామి అమ్మవార్లకు పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించారు. ఊసారెడ్డి రాధాక్రిష్ణారెడ్డి, సులోచనమ్మ, చిట్టమూరు శ్రీనివాసులు రెడ్డి, ఉమామహేశ్వరి, కొండా రామచంద్రారెడ్డి, భవాని, సోమిశెట్టి రామసుబ్బయ్య, రాజ్యలక్ష్మి, మందపాక మురళీరెడ్డి, రాధ, జనార్దనరెడ్డి, అనూష ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇళ్ల సమీపంలో ఖననం చెయ్యొద్దు

అంత్యక్రియలను అడ్డుకున్న ఎస్సీ కాలనీవాసులు



మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న తహసీల్దారు విజయలక్ష్మి

బాలాయపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండలి గ్రామానికి చెందిన వల్లెపు కోటమ్మ(110) మృతి చెందింది. మంగళవారం ఆమె మృతదేహాన్ని సమీపంలోని చెరువులో ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. దీంతో సమీపంలోని ఎస్సీ కాలనీవాసులు అభ్యంతరం చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న తహసీల్దారు విజయలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, పోలీసులను ఘటనాస్థలానికి పంపి మృతదేహాన్ని ఇళ్ల సమీపంలో పూడ్చనీయవద్దని చెప్పారు. మృతురాలి కుటుంబసభ్యులు అంగీకరించపోవడంతో తహసీల్దారు విజయలక్ష్మి వెళ్లి చెరువులో ఖననం చేయడం కుదరదని స్పష్టం చేశారు. దీంతో కోటమ్మ మృతదేహాన్ని శ్మశానంలో పూడ్చిపెట్టారు.

ఆధార్ కేంద్రం తెరిచేదెప్పుడో?



వారం రోజులుగా మూతబడి ఉన్న ఆధార్ కేంద్రం

కోట, మే 13 (ఆంధ్రజ్యోతి): కోట, విద్యానగర్‌లోని ఆధార్ కేంద్రాలు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని 21 పంచాయతీల ప్రజలు ఇక్కడ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకుంటూ వచ్చారు. అయితే గత వారం రోజుల నుంచి ఈ ఆధార్ కేంద్రం మూతబడింది. ప్రతిరోజు ఆధార్ సేవల కోసం ప్రజలు వచ్చి తాళం వేసి ఉండడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. విద్యానగర్‌కు వెళ్లినా అక్కడి ఆధార్ కేంద్రం కూడా పనిచేయకపోవడంతో ప్రజల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోండి

సూళ్లూరుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం అందించే అన్నదాత సఖీభవ పథకానికి ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత కోరారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన రైతులందరూ అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల ఏవోలు కిరణ్, కవిత, జ్యోతిర్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కరిమాణిక్యస్వామి గరుడసేవ



నాయుడుపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించారు.

ఉపాధి పనులు చేస్తూ కూలీ మృతి

వాకాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపాళెం గ్రామానికి చెందిన పావలశెట్టి కలివేలమ్మ(56) మంగళవారం ఉపాధి పనులకు వెళ్లింది. ఎండ తీవ్రతకు తట్టుకోలేక అస్వస్థతకు గురవడంతో వెంటనే నిడిగుర్తి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాసులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి సాయం అందేలా చూస్తామని చెప్పారు. ఎంపీడీవో వెంట ఏపీవో విజయమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, మల్లికార్జున ఉన్నారు.

విద్యుత్ కార్యాలయ ఉద్యోగి ఆత్మహత్య

గూడూరు అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న సుబ్బారావు(43) నెల్లూరులోని విద్యుత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. కుటుంబకలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన సుబ్బారావు మంగళవారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంసభ్యులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తడ, మే 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి చెందిన ఘటన తడ - అక్కంపేట మధ్య మంగళవారం జరిగింది. మృతుడు తెలుపు, నీలిరంగు గళ్ల చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, అంతకుమించి ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

నాలుగేళ్ల చిన్నారితో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

గూడూరు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారి ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. చిన్నారి కేకలు వేయడంతో స్థానికులు ఆ వృద్ధుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు.

విద్యుదాఘాతంతో రెండు ఆవుల మృతి

వెంకటగిరి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని యాతలూరు గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి చెందాయి. పొలాల్లో మేత మేస్తున్న ఆవులపై విద్యుత్ తీగ తెగిపడింది. దీంతో ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితులు వీరరాఘవులు, సులోచనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా గిరిధర్‌రెడ్డి

నాయుడుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా నాయుడుపేటకు చెందిన ఓడూరు గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు సమాచారం అందింది.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కోట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుచ్చలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు మంగళవారం బాల్యవివాహాల నిర్మూలన, చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్ అనిత, మహిళా పోలీస్ సునీల, మస్తానమ్మ, సచివాలయ సిబ్బంది పుచ్చలపల్లి పంచాయతీలోని చిన్నారుల తల్లులకు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అదేవిధంగా కార్మిక చట్టాలు, మహిళా హక్కుల గురించి అవగాహన కల్పించారు.

సూరిశెట్టిపాళెంలో కోటమ్మ ఉత్సవాలు

కోట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు పంచాయతీ సూరిశెట్టిపాళెంలో గ్రామదేవత కోటమ్మ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలకు గ్రామస్తులు అంకురార్పణ చేశారు. అమ్మవారి పుట్టినిల్లైన నెల్లూరుపల్లి కొత్తపాళెం నుంచి నగలు, అభరణాలను గంగపెట్టెలో ఉంచుకుని మేళతాళాలతో సూరిశెట్టిపాళెంలోని అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ముగ్గులు వేశారు. మొదటి రోజు జమిళ్ల కట్టి గ్రామంలోకి దుష్టశక్తులు, అంటురోగాలు ప్రబలకుండా ప్రత్యేక పూజలు చేశారు.



కోటమ్మ ఆభరణాలు తీసుకువెళుతున్న గ్రామస్తులు